మహారాష్ట్ర, జార ండ్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఏఐసీసీ చీఫ్ మల్లి కార్జున ఖర్గే చేసిన కామెంట్లు రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీశాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని.. అమలు చేయగలిగే హామీలు, గ్యారంటీలు మాత్రమే ఇవ్వాలని, ప్రణాళిక లేని హామీలు బడ్జెట్‌పై భారం వేయడమే కాకుండా, పార్టీ విశ్వసనీయతను దెబ్బతీస్తాయని చెప్పడంపై ప్రధాని మోడీ రియాక్ట్ అయ్యారు. కాంగ్రెస్ నిజస్వరూపం బయటపడిందని, ఆ పార్టీ ఎన్నికల్లో ఇచ్చే హామీలన్నీ ఆచరణ సాధ్యం కానివేనని 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. దీనికి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. బీజేపీ కంటే కాంగ్రెస్ ఎంతో బెటర్ అని, మెల్లమెల్లగా గ్యారంటీలు, హామీలు అమలు చేస్తున్నామని చెప్పారు. అయితే రాష్ట్రంలో 2023 డిసెంబర్ ఏడో తేదీన కాంగ్రెస్ సర్కారు కొలువుదీరింది. మరో నెల రోజుల్లో ఈ ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకోనుంది. వారం రోజుల పాటు వేడు కలు నిర్వహించేందుకు సైతం కసరత్తు చేస్తున్నది. ఈ నేపథ్యంలో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, ఏడాదిలో అమలైన వాటిని పరిశీలిస్తే.. చెప్పిన వాటిలో పూర్తి చేసినవి చాలా కొన్ని మాత్రమేననే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

**ఆరు గ్యారంటీల్లో అమలైనవెన్ని?**

కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి 'ఆరు గ్యారంటీలు' కీలక పాత్ర పోషించాయి. అయితే ఈ ఆరు గ్యారంటీల్లో గృహజ్యోతి ఒక్కటే పూర్తిస్థాయిలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయగలిగింది. ఈ స్కీమ్ కింద అర్హులకు 200 యూనిట్ల ఫ్రీ కరెంట్ ఇస్తున్నది. మహాలక్ష్మి గ్యారంటీ కింద మహిళలకు మూడు హామీలు ఇవ్వగా.. ఒక్క ఫ్రీ బస్ జర్నీని మాత్రమే పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నది. రూ. 500కే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నా.. అది అర్హులైన ప్రతి కుటుంబానికి అందడం లేదనే విమర్శలున్నాయి. మహిళలకు ఇస్తాన్న రూ. 2500 ఆర్థిక సాయం హామీ అసలు ప్రస్తావనలోనే లేకుండాపోయింది. రైతు భరోసా గ్యారంటీ కింద ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా అమలు కాలేదు. ధాన్యానికి రూ. 500 బోనస్ ప్రకటనలకే పరిమితమైంది. రైతుబంధు పేరు మార్చి రైతు భరోసా కింద రూ. 15 వేలు ఇస్తామని చెప్పి... ఉన్న రైతు బంధును ఎగ్గొట్టేశారని రైతులు వాపోతున్నారు. తమకు ఇస్తామన్న రూ. 12వేల కోసం రైతుకూలీలు ఎదురుచూస్తూనే ఉన్నారు. యువ వికాసం గ్యారంటీ కింద విద్యా భరోసా కింద విద్యార్థులకు రూ. 5 లక్షలు, ప్రతి మండలానికి తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్స్ హామీని పూర్తిస్థాయిలో మరిచిపోయినట్టు కనిపిస్తున్నారు. ప్రభుత్వం ఏడాది పూర్తి కావస్తున్నా ఇందిరమ్మ ఇండ్ల గ్యారంటీ ఇంకా సమావేశాల్లో చర్చల దశలోనే ఉన్నది. చేయూత గ్యారంటీ కింద రెండు హామీలు ఇవ్వగా, ఇందులో ఆరోగ్య శ్రీ కింద ఇన్సూరెన్స్ ను రూ. 10 లక్షలకు పెంచారు. వృద్ధులు, వికలాంగులు, ఇతర వర్గాలకు ఇస్తున్న పింఛన్లను రూ. 4వేలకు పెంచుతామన్న హామీని పూర్తిస్థాయిలో మరిచిపోయినట్టు కనిపిస్తున్నారు.

**డిక్లరేషన్ల హామీలూ అలాగే..**

అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీలే కాకుండా వివిధ డిక్లరేషన్ల పేరుతో కాంగ్రెస్ వందలాది హామీ ఇచ్చింది. వీటిలో అమలు చేసినవి వేళ్లలో లెక్కపెట్టొచ్చు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందజేస్తామని కాంగ్రెస్ చెప్పింది. అయితే ఈ అంశం సమావేశాలకే పరిమితమైంది. ఇంకా ప్రాసెస్ స్టార్ట్ కాలేదు. ఏకకాలంలో రైతు రుణమాఫీని అమలు చేశామని చెబుతున్నా అనేక విమర్శలు వచ్చాయి. టెక్నికల్ సమస్యలు ఉన్నాయని ప్రభుత్వం చెబుతున్నా.. ఇంకా రుణమాఫీ కోసం లక్షలాది మంది రైతులు ఎదురుచూస్తున్నారు. నిరుద్యోగ యువతకు రూ. 4వేల నిరుద్యోగ భృతి చెల్లిస్తామని 'యూత్ డిక్లరేషన్'లో హామీ ఇచ్చినా... అలాంటిదేమీ చెప్పలేదని ఇప్పుడు కాంగ్రెస్ నేతలు మాట మార్చేశారు. అమరవీరుల కుటుంబాలకు రూ. 25వేల గౌరవ పెన్షన్, తెలంగాణ ఉద్యమకారులకు 250 చదరపు గజాల ఇంటి స్థలం హామీలు అసలు కాంగ్రెస్ ప్రభుత్వానికి గుర్తే లేకుండా పోయాయి. ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్ షిప్ పెండింగ్ బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యువ మహిళా సాధికారత పేరుతో చదువుకునే ప్రతి యువతికి ఎలక్ట్రిక్ స్కూటర్లను అందజేస్తామని కాంగ్రెస్ చెప్పింది. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రూ. 12 లక్షల వరకు ఆర్థిక సాయం చేస్తామని 'ఎస్సీ ఎస్టీ డిక్లరేషన్'లో పేర్కొన్నది. కల్యాణలక్ష్మి కింద రూ. లక్ష నగదుతోపాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చింది. ఉర్దూ మీడియం ఉపాధ్యాయుల నియామకానికి ప్రత్యేక డీఎస్సీ, విద్యార్థులకు ఫ్రీ వైఫై సౌకర్యం, రూ. 3లక్షల వరకు వడ్డీ లేని పంట రుణాలు, అంగన్ వాడీ టీచర్ల వేతనం రూ. 18వేలకు పెంపు, రవాణా వాహనాలకు సింగిల్ పర్మిట్ విధానం.. ఇలాంటి హామీల అమలుపై కనీసం ఎలాంటి చర్చా జరగడం లేదు

# సార్థక సమ్మిళిత వృద్ధి ఏదీ?

■ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించడం అనివార్యం ■ ఇది కొత్తదేమీకాదు. మన రాజ్యాంగం ఆదేశిక సూత్రాలలోనే ఈ భావన ■ దేశ సంపద ఏ కొన్ని వర్గాలకో పరిమితం కారాదన్నది వాస్తవం ■ ఏటా 7% ఆర్థికాభివృద్ధి సాధిస్తున్న భారతదేశం ■ తమ శ్రమశక్తితో దేశ స్థూల ఉత్పత్తికి 10శాతం వాటా అందిస్తున్న వలస కార్మికులు ■ కనీసం జాతీయ నిత్యవసర పంపిణీకి నోచుకోని దైన్యస్థితి ■ వలస కార్మికులకు రేషన్ కార్డులు జారీ చేయండన్న సుప్రీం ధర్మాసనం



సి. రామచంద్రయ్య
శాసనమండలి సభ్యులు
ఆంధ్రప్రదేశ్ శాసనమండలి

సమ్మిళిత అభివృద్ధి (ఇంక్లూజివ్ గ్రోత్) అనే భావన ఉదార ఆర్థిక విధానాలు మొదలయ్యాక ఎక్కువైంది. గ్లోబలైజేషన్ కారణంగాను, దేశంలో ఆర్థిక సంస్కరణలు వేగం పుంజుకున్నాక ప్రజల మధ్య పెరిగిన ఆర్థిక అంతరాలను తగ్గించే క్రమంలో సమ్మిళిత అభివృద్ధి మార్గాన్ని భారతదేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించడం అనివార్యమైంది. అసలు సమ్మిళిత అభివృద్ధికి సరైన నిర్వచనం ఏమిటి? అన్ని రంగాలలో అభివృద్ధి సాధించడమే సమ్మిళిత అభివృద్ధిగా భావించాలా?.. అభివృద్ధిలో ఏ ఒక్క వర్గాన్ని విస్మరించక పోవడమే సమ్మిళిత అభివృద్ధి అవుతుంది. నిజానికి సమ్మిళిత అభివృద్ధి అనే భావన కొత్తదేమీకాదు. మన రాజ్యాంగం ఆదేశిక సూత్రాలలోనే ఈ భావన ఉంది. దేశ సంపద ఏ కొన్ని వర్గాలకో పరిమితం కారాదని, కొండల్లో, కోనల్లో.. మారుమూల ప్రాంతాల్లో నివసించే ప్రజలు సైతం ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలని, అందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలని రాజ్యాంగం స్పష్టంగా పేర్కొంది. ఏటా 7% ఆర్థికాభివృద్ధి సాధిస్తున్న భారతదేశంలో సమ్మిళిత అభివృద్ధి ఏవిధంగా ఉ న్నదో చెప్పడానికి ఇటీవల దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని, కొన్ని రాష్ట్రాలను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యల్ని ఉటంకించాలి. దీనికంటే ముందు.. ఆ కేసు పుర్వాపరాలను మననం చేసుకోవాలి. యావత్ ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన కరోనా మహమ్మారి భారత్ పై న కూడా అత్యంత దారుణమైన ప్రభావం చూపడాన్ని ఏ ఒక్కరూ మర్చిపోలేరు. పీడకల లాంటి ఆ విపత్కర సమయంలో దేశంలో వలస కార్మికులు పడిన కష్టాలు, కడగండ్లు అందరి గుండెల్ని పిండేశాయి. లాక్డౌన్ నేపథ్యంలో వలస కార్మికులు తమ పిల్లాపాపలతో, వృద్ధులతో, ఆకలిదప్పులతో మండుటెండల్లో వందల కిలోమీటర్లు నడుచుకొంటూ స్వస్థలాలకు పయనమైన సందర్భాలలో వారు అనుభవించిన వేదన మానవ ఇతిహాసంలో ఓ చీకటి అధ్యాయం. దేశంలో ఒక రాష్ట్రం నుండి మరో రాష్ట్రానికి, ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వివిధ రకాల పనులు చేసే నిమిత్తం వలసపోయే కార్మికుల సంఖ్య దాదాపు 14కోట్లు. వలస కార్మికులు తమ శ్రమశక్తితో దేశ స్థూల ఉత్పత్తికి 10శాతం వాటా అందిస్తున్నారు. కానీ, స్థిర నివాసం లేని కారణంగా వలస కార్మికులకు రేషన్కార్డులను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేయడం లేదు. అటువంటి పూర్వరంగంలోనే వలస కార్మికుల సమస్యలు, కష్టాలపై సుమోటో కేసును విచారించిన ముగ్గురు న్యాయమూర్తుల సుప్రీం ధర్మాసనం జూన్ 29, 2021న ఓ చారిత్రక తీర్పును వెలువరించింది. దేశవ్యాప్తంగా ఉన్న అసంఘటితరంగ కార్మికులు, వలస కూలీల వివరాల నమోదు ప్రక్రియ చేపట్టి 6నెలల్లో పూర్తి చేయాలని కేంద్ర కార్మిక శాఖను ఆదేశించింది. ఇందుకుగాను 'నేషనల్ డేటా బేస్ పోర్టల్' ఏర్పాటు చేయాలని, వలస కార్మికులకు రేషన్ సరుకుల పంపిణీకిగాను రాష్ట్రాలు తగిన పథకాలు రూపొందించాలని, ఆ మేరకు కేంద్రం అదనపు ఆహార ధాన్యాలను రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు అందజేయాలని స్పష్టం చేసింది. జూలై 31, 2021 నాటికల్లా ఎక్కడి నుంచైనా రేషన్ తీసుకునే 'ఒకేదేశం- ఒకే రేషన్ కార్డు' విధానాన్ని అమలు చేయాలని, కరోనా కొనసాగింతకాలం వలస కార్మికులు ఉన్నచోట రాష్ట్ర ప్రభుత్వాలు సామాజిక వంటశాలలు (కమ్యూనిటీ కిచెన్స్) నిర్వహించి ఆహారం అందించాలని ధర్మాసనం తన 80 పేజీల తీర్పులో ఆనాడు స్పష్టం చేసింది.

సుప్రీం ధర్మాసనం తీర్పు వెలువడి ఇప్పటికీ 3 సంవత్సరాల 3 నెలలైంది. కానీ, ఆశ్చర్యం.. వలస కార్మికులకు రేషన్ కార్డుల పంపిణీ ఇంకా మొదలే కాలేదు. ఈ అసాధారణ జాప్యం సహజంగానే సర్వోన్నత న్యాయస్థానానికి ఆగ్రహం తెప్పించింది. వలస కార్మికులకు రేషన్కార్డుల జారీలో చిత్తశుద్ధి చూపని కేంద్రం, కొన్ని రాష్ట్రాలు తమకు తగిన సమయం కావాలంటూ గడువుల మీద గడువులు కోరుతూ వస్తున్నాయి. అయితే అక్టోబర్ 4,2024న ఈ కేసును విచారించిన జస్టిస్ సుధాంశు ధూలియా, జస్టిస్ అసనుద్దీన్ల బెంచ్ తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. "ఓపిక పట్టడం అన్నది గొప్ప సుగుణమే కావొచ్చు. కానీ మా ఓపిక తుది దశకు చేరుకొంది. నవంబర్ 19, 2024 మీకు చివరి గడువు. ఈలోగా వలస కార్మికులకు రేషన్ కార్డులు జారీ చేయండి" అని ఇద్దరు న్యాయమూర్తుల సుప్రీం ధర్మాసనం కేంద్రానికి, రాష్ట్రాలను తీవ్ర స్వరంతో హెచ్చరించింది. భారత ఆహార సంస్థ గిడ్డంగుల్లో, ఇతర చోట్ల ముక్కిపోతున్న, ఎలుకలు తినేస్తున్న తిండి గింజలను చూసుకొని దేశ ఆహార భద్రత బేషుగ్గా ఉందని జబ్బలు చరుచుకొంటున్న పాలకుల కళ్లు తెరిపిస్తూ.. "అవి మిగులు తిండి గింజలు కాదురా బాబూ! వాటిని ఆకలి గింజలని పిలవాలి.. దేశంలో ప్రజలందరూ రెండు పూటలా కడుపు నిండా తిన్నాక మిగిలిన వాటినే మిగులు గింజలనాలి" అని నోబెల్ గ్రహీత అమర్త్యసేన్ చెప్పాక, అదేవిధంగా సుప్రీంకోర్టు కూడా గోడౌన్లలో ఉన్న ఆహార ధాన్యాలను సక్రమంగా వినియోగించమని అక్షింతలు వేశాకనే అప్పటి కేంద్ర ప్రభుత్వం 'మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి 'శ్రీకారం చుట్టింది. తద్వారా ఉపాధి కూలీలకు వ్యవసాయేతర సీజన్లో తిండి తినడానికి అవకాశం ఏర్పడింది.అయితే, దేశంలో ఇప్పటికీ రేషన్ లభించని అభాగ్యులు ఇంకా కోట్ల సంఖ్యలో ఉ న్నారు. వలస కార్మికులతో పాటు సంచార జాతుల వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందడం లేదని చెప్పటం అతిశయోక్తి కాదు. వలస కార్మికులు కనీసం ఏదో ఒక ప్రదేశంలో కొన్ని నెలలపాటు నివాసం ఉంటారు. కానీ, సంచార జాతుల వారి పరిస్థితి మరీ దారుణం. వారు మానవ సమూహాలకు దూరంగా అక్కడక్కడ తాత్కాలిక నివాసాలు ఏర్పరచుకొని జీవిస్తుంటారు. వీరెవరికి రేషన్కార్డులు, ఆధార్ కార్డులు ఇవ్వడం లేదు. ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త ఎం.ఎస్ శ్రీనివాసన్ చెప్పినట్లు.. వీరి గుడిసెల్లోకి, టెంటుల్లోకి ఇంకా ప్రజాస్వామ్యం ప్రవేశించలేదు.

**ఏపీలో పేదల కడుపు నింపుతున్న అన్నా క్యాంటీన్లు**

దేశంలో దాదాపుగా ప్రతి పట్టణంలో భవన నిర్మాణ కూలీలు, యాచకులు, పారిశు ధ్య కార్మికులు.. రోడ్లవెంట అద్దాలు, దువ్వెనలు, రంగురాళ్లు, ప్లాస్టిక్ పరికరాలు, పిల్లల ఆట వస్తువులు అమ్మే వాళ్లు వందలు, వేల సంఖ్యలో కనిపిస్తుంటారు. అందులో అత్యధికులకు రేషన్ కార్డులు ఉండవు. ఒకవేళ ఉన్నప్పటికీ ఒకేసారి రేషన్ తెచ్చుకొనే ఆర్థిక స్థోమత వారికి ఉండదు. అటువంటి వారికి నామమాత్రపు ధరలతో కడుపునిండా భోజనం పెట్టడానికి క్యాంటీన్లు తెరవటం ప్రభుత్వాల బాధ్యత. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'అన్న క్యాంటీన్లు' ప్రవేశపెట్టి పేదలకు అక్షయపాత్రలా ఆదుకొంటోంది.

నిజానికి కరోనా సమయంలోనే వలస కార్మికులకు, నిరుపేదలకు కమ్యూనిటీ కిచెన్స్ ప్రారంభించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. అప్పటికే తమిళనాడులో అమ్మా క్యాంటీన్లు, తెలంగాణలో అన్నపూర్ణ క్యాంటీన్లు నడుస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్లో 2019 ముందు వరకు చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని తెలుగుదేశం ప్రభుత్వం దాదాపు 100 పట్టణాల్లో అన్నా క్యాంటీన్లు నిర్వహించింది. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్మోహన్రెడ్డి ప్రభుత్వం రాజకీయ కక్షతో అన్నా క్యాంటీన్లను మూత వేయించింది. కరోనా సమయంలో కూడా వాటిని పునరుద్ధరించలేదు. నిరుపేదల కడుపులు నింపలేదు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్లో చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం మళ్లీ అన్నా క్యాంటీన్లను పునరుద్ధరించి నిరుపేదల పాలిట కల్పతరువుగా మారింది. వలస కార్మికులకు, సంచార జాతుల వారికి రేషన్ కార్డులు అందించేవరకు ఈ అన్నా క్యాంటీన్లు వాళ్ల కడుపు నింపుతాయి. అన్నా క్యాంటీన్ వంటి పథకాన్ని నిజానికి కేంద్ర ప్రభుత్వమే దేశవ్యాప్తంగా అమలు చేయాలి. ఎందుకంటే కోట్లాది మంది ఆకలితోనో, అర్ధాకలితోనో అలమటిస్తుంటే, అభివృద్ధి గురించి, భవిష్యత్ గురించి మాట్లాడటం ఆత్మవంచనే అవుతుంది. అంతేకాదు.. దేశ సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల్ని ఖాతరు చేయకపోవడం, రేషన్ కార్డుల జారీలో మితిమీరిన జాప్యం చేయడం దేశ ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధం. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే పేదల కోసం గరీబ్ కల్యాణ్ రోజ్గర్ అభియాన్, ఆత్మనిర్భర్ భారత్, ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ యోజన తదితర పథకాలను అమలు చేస్తూ ఉండొచ్చు. కానీ, వలస కార్మికుల్ని, సంచార జాతుల వారిని.. ముఖ్యంగా పౌర సమాజానికి వెలుపల జీవిస్తూ ఎటువంటి గుర్తింపు, అస్థిత్వం లేకుండా సుస్థిర స్వయంప్రతిపత్తి పొందే అవకాశం లేకుండా.. జాతి సంపదలో ఎటువంటి వాటా పొందటానికి నోచుకోకుండా జీవిస్తున్న వీరందర్నీ జాతీయ జీవన స్రవంతిలోకి తేవాలి. వారికి రేషన్కార్డులు, ఆధార్ కార్డులు, ఎన్నికల ఓటింగ్ కార్డులు మొదలైనవి అందిచడం ద్వారా వారికున్న హక్కులను పరిరక్షించి వారందరినీ ప్రజాస్వామ్య పరిధిలోకి తీసుకురావాలి. అప్పుడే కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు చెప్పే సమ్మిళిత అభివృద్ధికి నిజమైన అర్థం లభిస్తుంది.

# ఐఏఎస్ అధికారుల వాట్సప్ గ్రూపుపై వివాదం

● స్క్రీన్ షాట్ వైరల్ కావడంతో విమర్శలు ● స్పందించిన కేరళ రాష్ట్ర ప్రభుత్వం ● ఒక వర్గం ఆధారంగా గ్రూపు ఏర్పాటు చేసుకోవడం సరికాదు ● వ్యవహారంపై ప్రభుత్వం విచారణ జరుపుతుంది ● కేరళ మంత్రి పి.రాజీవ్



తిరువనంతపురం: ప్రత్యేక వర్గం పేరుతో ఐఏఎస్ అధికారులు వాట్సప్ గ్రూప్ ఏర్పాటుచేయడం కేరళ లో వివాదాస్పదమైంది. ఆ వాట్సప్ గ్రూప్నకు సంబంధించిన స్క్రీన్షాట్ వైరల్ కావడంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై రాష్ట్రప్రభుత్వం స్పందించింది. ఒక వర్గం ఆధారంగా అధికారులు గ్రూపులు ఏర్పాటుచేసుకోవడం సరికాదని కేరళ మంత్రి పి.రాజీవ్ అన్నారు."ఈ వ్యవహారంపై ప్రభుత్వం విచారణ జరుపుతుంది. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్కు సంబంధించి ప్రవర్తనా నియమావళి ఉంటుంది. దాని ఆధారంగా విచారణ ఉంటుంది" అని మంత్రి మీడియాకు వెల్లడించారు. మరోవైపు ఈ గ్రూప్ అడ్మిన్గా సీనియర్ ఐఏఎస్ అధికారి కె.గోపాలకృష్ణన్ పేరు ఉందని మీడియా కథనాలు వెల్లడించాయి. ఆ గ్రూప్లో సీనియర్, జూనియర్ ఐఏఎస్ అధికారులు ఉన్నారని పేర్కొన్నాయి. విమర్శలు రావడంతో వెంటనే దానిని డిలీట్ చేశారు. మరోవైపు తన వాట్సప్ హ్యాక్ అయిందని గోపాలకృష్ణన్ సైబర్ సెల్కు ఫిర్యాదు చేశారు. తనకు తెలియకుండా ఈ గ్రూప్ క్రియేట్ అయిందని అందులోని సభ్యులకు మెసేజ్ కూడా పంపారు. నిష్పక్షపాతంగా.. వ్యవహరిస్తూ... ప్రజలకు సేవలు అందించాల్సినఅధికారులు స్థాయిని దిగజార్చే విధంగా ప్రవర్తిస్తున్నారని నెటిజనులు సోషల్ మీడియాలో విమర్శిస్తున్నారు.

### బీజేపీ అధికారంలోకి వస్తే

# 3 లక్షల ఉద్యోగాలిస్తాం

● యువతలో ప్రతిభకు కొదవ లేదు.. ● జేఎమ్ఎమ్, కాంగ్రెస్, ఆర్జేడీ పార్టీలు యువతకు ద్రోహం చేశాయి ● బుజ్జగింపులే హేమంత్ సోరెన్ ప్రభుత్వం ఎజెండా ● గర్వా బహిరంగ సభలో ప్రధాని మోడీ



రాంచీ: జార?ండ్, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల తేదీ సమీపిస్తోంది. మహారాష్ట్రతో పాటు జార?ండ్ ఎన్నికల్లోనూ విజయం సాధించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది. జార?ండ్లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా తర్వాత, ప్రధాని మోడీ కూడా ఎన్నికల ప్రచార బాధ్యతలు చేపట్టారు. సోమవారం గర్వాలో జరిగిన బహిరంగ సభలో ప్రధాని మోడీ ప్రసంగించారు. గిరిజన సంఘం, అవినీతి, బంధుప్రీతి తదితర అంశాలపై జార?ండ్లోని అధికార పార్టీని తన ప్రసంగంలో ప్రధాని లక్ష్యంగా చేసుకున్నారు. అయితే.. ఈ ప్రధాని ప్రసంగంలో యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు, కాపీయింగ్ మాఫియాపై చర్యలు తీసుకోవడం గురించి ప్రస్తావించారు. రాష్ట్ర స్థాయిలో ఉద్యోగాల గురించి ప్రధాని నేరుగా మాట్లాడటం చాలా అరుదు.

**నిరుద్యోగ సమస్యకు సమాధానం:**

జార?ండ్లో యువతకు ప్రభుత్వ ఉద్యోగాలను ప్రధాని మోడీ ప్రముఖంగా ప్రస్తావించారు. బీజేపీ అధికారంలోకి వస్తే 3 లక్షల మంది యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామని అన్నారు. నిజానికి.. నిరుద్యోగ సమస్యపై కాంగ్రెస్ బీజేపీని నిరంతరం కార్నర్ చేస్తోంది. అటువంటి పరిస్థితిలో ఈ విషయంపై ప్రసంగించడం ఆసక్తి రేపుతోంది. జార?ండ్ యువతలో ప్రతిభకు కొదవ లేదని ఆయన అన్నారు. జార?ండ్కు చెందిన కుమారులు, కుమార్తెలు క్రీడారంగంలోస్ఫూర్తిని చాటుతున్నారని కొనియాడారు. జార?ండ్ యువతలో సామర్థ్యాలను పెంచడం, వారికి కొత్త అవకాశాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు. కానీ జేఎమ్ఎమ్, కాంగ్రెస్, ఆర్జేడీలు జార?ండ్ యువతకు ద్రోహం చేశాయని ఆరోపించారు.

**ఝార్ఖండ్లో పొలిటికల్ హీట్** : అసెంబ్లీకి ఎన్నికల వేళ పొలిటికల్ హీట్ నెలకొంది. అధికార జార?ండ్ ముక్తి మోర్చా పార్టీపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బుజ్జగింపులే సీఎం హేమంత్ సోరెన్ ప్రభుత్వ ప్రధాన ఎంజెడా అని మండిపడ్డారు. బంగ్లాదేశ్చొరబాటుదారులు జార?ండ్ వ్యాప్తంగా విస్తరిస్తున్నారు. వారి ఓట్లను పొందడానికి ప్రభుత్వం మద్దతుదారులుగా వ్యవహరిస్తోంది. సరస్వతీ గేయాన్ని పాఠశాలలో ఆలపించేందుకు అనుమతించకపోడం ఎంత పెద్ద ప్రమాదమో ఊహించుకోండి. పండుగల వేళ రాళ్ల దాడి జరుగుతోంది. కర్ఫ్యూ విధించడం, దుర్గా ర్యాలీని ఆపడం అది ఎంత ప్రమాదకరమో మీకు తెలుసు. చొరబాటు సమస్య కోర్టుకు వెళ్లినప్పుడు ప్రభుత్వ యంత్రాంగం విఫలమైంది. జేఎంఎం, కాంగ్రెస్, ఆర్జేడీల దుష్ట విధానాలు ఇలాగే కొనసాగితే జార?ండ్లో ఆదివాసీ సమాజం నాశనం అయిపోతుంది. కేంద్ర పథకాలను అమలు చేసే ప్రభుత్వం రాష్ట్రంలో ఉంటేనే జార?ండ్లో అభివృద్ధి సాధ్యమవుతుంది' అని పేర్కొన్నారు. స్వార్థపూరిత పార్టీలకు గుణపాఠం చెప్పడం అవసరం. నాకు ఫ్యామిలీ లేదు. ప్రజలే నా కుటుంబం" అని మోడీ వ్యాఖ్యానించారు.

# నేడే అమెరికా అధ్యక్ష ఎన్నికలు

● ఉదయం 6 నుంచి రాత్రి 8 వరకు ఓటింగ్ ● పోలింగ్ కంటే ముందే ఓటేసిన 6.8కోట్ల మంది ● పోలింగ్ సందర్భంగా భారీ క్యూలు ఉండే అవకాశం ● సంప్రదాయం ప్రకారం ముందస్తు ఓటింగ్ను ఉపయోగించుకుంటున్న ఓటర్లు ● 50శాతం పెరిగిన ముందస్తు పోలింగ్ కేంద్రాలు ● న్యూయార్క్లో బెంగాలీ బ్యాలెట్ పేపర్



వాషింగ్టన్: యావత్ ప్రపంచం ఎంతో ఉత్కంఠగా ఎదురు చూస్తున్న అమెరికా అధ్యక్ష ఎన్నికలకు కౌంట్ డౌన్ స్టార్ట్ అయింది. మరికొద్ది గంటల్లో అంటే మంగళవారం ఉదయం 6 గంటలకు ఓట్ల సమరం ప్రారంభం కానుంది. రేపు జరిగే ఎన్నికల్లో కొత్త అధ్యక్షుడిని ఎన్నుకునేందుకు అమెరికా ప్రజలు రెడీ అయ్యారు. గత కొన్ని నెలలుగా డొనాల్డ్ ట్రంప్, కమలా హారిస్ మధ్య జరుగుతున్న ఎన్నికల ప్రచారాన్ని పరిశీలిస్తున్న విజేత ఎవరో తేల్చేయబోతున్నారు. తమ తీర్పును ఓట్ల ద్వారా బ్యాలెట్ బాక్సుల్లో వేసేందుకు ఉత్సాహంగా ఎదురు చూస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా అందరి కళ్లు అమెరికా పోలింగ్ పైనే ఉన్నాయి. అమెరికా అధ్యక్షుడెవరనేది మరికొన్ని గంటల్లో తేలిపోనుంది. ప్రజాస్వామ్యంలో అతిపెద్ద ఓట్ల పండుగలో పాల్గొంటున్న ఓటర్ల మదిలో ఏముందో.. ఎవరికి పట్టం కట్టబోతున్నారో తెలుసుకోవడానికి యావత్ ప్రపంచం ఆసక్తిగా గమనిస్తోంది. ఈ ఎన్నికలు అమెరికాలో పుట్టి పెరిగిన అమెరికన్లకు ఎంత ముఖ్యమో.. అగ్రరాజ్యం అధ్యక్షుడు తుమ్మినా.. దగ్గినా ప్రభావానికి గురయ్యే అనేక దేశాలతోపాటు.. మొత్తం ప్రపంచమే అగ్రరాజ్యం ఓట్ల పండుగపై దృష్టి కేంద్రీకరించి ఊపిరి బిగబట్టి చూస్తున్నాయి. అమెరికా సంప్రదాయం ప్రకారం పోలింగ్ తేదీ కంటే ముందుగానే ఓటేసే అవకాశాన్ని కోట్ల మంది అమెరికన్లు వినియోగించుకుంటున్నారు. మంగళవారం పోలింగ్ జరగనుండగా ఇప్పటికే 6.8 కోట్ల మంది ఓటేశారు. పోలింగ్ రోజున భారీ క్యూలు.. ఘర్షణలు.. అసాధారణ వాతావరణ పరిస్థితులు ఎదురైతే ఓటింగ్ మిస్ అవుతామనే ఉద్దేశంతో చాలా మంది ముందస్తు ఓటింగ్ వైపు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. ఒక్క న్యూయార్క్ నగరంలోనే గత ఎన్నికల కంటే 50 శాతం అధికంగా ముందస్తు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి వచ్చిందంటే ఓటర్ల ముందు చూపు.. ఉత్సాహం ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. డొనాల్డ్ ట్రంప్, కమలా హారిస్ తమ ప్రచారం చివరి అంకంలో ఓటర్లను ఆకట్టుకునేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఎవరు గెలిస్తే ఎలా ఉండబోతున్నాయనే చర్చకు మరికొద్ది గంటల్లో తెరపడబోతోంది. భారత సంతతి మూలాలున్న కమలా హారిస్ గెలుస్తుందా.. లేక.. డొనాల్డ్ ట్రంప్ అధ్యక్ష పీఠాన్ని కైవసం చేసుకుంటారా.. తేలే సమయం ఆసన్నమైంది. భారత్ లో మాదిరిగానే మిగిలిన ప్రపంచ దేశాల్లో సైతం అగ్రరాజ్యం ఓట్ల పండుగ గురించి జరుగుతున్న చర్చలకు మరికొద్దిగంటల్లో అమెరికా ఓటర్లు తీర్పు చెప్పబోతున్నారు.

**బెంగాలీలో బ్యాలెట్:** ఓటర్లకు సౌలభ్యంగా ఉండేందుకు ఆయా రాష్ట్రాలు వివిధ భాషల్లో బ్యాలెట్లను అందుబాటులో ఉంచుతున్నాయి. ఓటర్లకు సౌలభ్యంగా ఉండేందుకు ఆయా రాష్ట్రాలు వివిధ భాషల్లో బ్యాలెట్లను అందుబాటులో ఉంచుతున్నాయి. ఈ క్రమంలో న్యూయార్క్ రాష్ట్రం ఇంగ్లిష్కు అదనంగా మరో ఐదు భాషల్లో వీటిని ముద్రించగా.. అందులో భారతీయ భాష 'బెంగాలీ' ఉండటం విశేషం. "ఎన్నికల ప్రక్రియలో ఇంగ్లిష్ కాకుండా మరో నాలుగు భాషలకు చోటు కల్పించాం. చైనీస్, స్పానిష్, కొరియన్, బెంగాలీ భాషల్లో బ్యాలెట్ అందుబాటులో ఉంది' అని న్యూయార్క్ రాష్ట్ర ఎన్నికల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మైఖేల్ జే రియాన్ పేర్కొన్నారు. ఇక్కడ స్థిరపడిన వారికి ఇంగ్లిష్ తెలిసినప్పటికీ మాతృ భాషలో అందుబాటులో ఉండటం ఆయా ప్రాంతాల వారికి సంతోషకర అంశమన్నారు. అయితే, భారత్లో అనేక భాషలున్నప్పటికీ గతంలో కోర్టులో వేసిన ఓ దావా వల్ల ఎన్నికల ప్రక్రియలో బెంగాలీకి చోటు లభించింది.

# విషాదాన్ని కేంద్రం రాజకీయం చేసింది

● వయనాడ్లో వందలాది మంది చనిపోయారు ● ఎంతో బాధ కలిగించిన విపత్తును బీజేపీ రాజకీయం చేసింది ● దేశ ప్రజలకు ఎలాంటి రాజకీయాలు కావాలో ఆలోచించాలి ● వయనాడ్ ఎన్నికల ప్రచారంలో ప్రియాంకా గాంధీ



వయనాడ్: బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పై కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకా గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. కేరళలోని వయనాడ్ లో కొండచరియలు విరిగిపడి వందలాది మంది ప్రాణాలు కోల్పేతే, బీజేపీ మాత్రం ఈ అంశంపై రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. ఉపఎన్నిక ప్రచారంలో భాగంగా సోమవారం సుల్తాన్ బతేరి నియోజకవర్గంలో ఆమె ప్రసంగించారు. 'ప్రజలకు ఎంతో బాధ కలిగించిన విపత్తును కూడా బీజేపీ రాజకీయం చేసింది. దేశ ప్రజలు ఎలాంటి రాజకీయాలు కోరుకుంటున్నారో వాటి గురించి ఆలోచించాల్సిన తరుణంలో మేము నిలబడి ఉన్నాం' అని తెలిపారు. బాధితులుగా మారిన వారిని ఆదుకునేందుకు నిధులు అందించడంలో కాషాయ పార్టీ తీవ్రంగా విఫలమైందన్నారు. ద్వేషం, కోపం, విభజన, విధ్వంసంతో కూడిన అంశాల మీదే బీజేపీ పాలిటిక్స్ ఉంటాయని మండిపడ్డారు. ప్రజలు ఎదుర్కొంటున్న వాస్తవ సమస్యలను విస్మరిస్తోందని వ్యాఖ్యానించారు. నిరుద్యోగం రోజు రోజుకూ పెరుగుతున్న దాని గురించి ఏనాడూ ఆలోచించడం లేదని విమర్శించారు. పార్లమెంటులో ప్రాతినిధ్యం వహించడానికి అవకాశం ఇస్తే, ప్రజల తరపున గళం విప్పుతానని నొక్కి చెప్పారు.

# కర్నాటక సీఎంకు లోకాయుక్త సమన్లు

● విచారణకు హాజరు కావాలని ఆదేశం ● భూ కుంభకోణం కేసులో విచారించనున్న లోకాయుక్త ● ఇప్పటికే ముఖ్యమంత్రి భార్య పార్వతి బీఎంను ప్రశ్నించిన లోకాయుక్త



బెంగళూరు: మైసూరు భూ కుంభకోణం కేసులో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు లోకాయుక్త సమన్లు జారీ చేసింది. బుధవారం విచారణకు రావాలని సమన్లలో పేర్కొంది. దీంతో మైసూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (ముడా)కు సంబంధించిన కేసులో ముఖ్యమంత్రిని లోకాయుక్త ప్రశ్నించనుంది. ఈ కేసుకు సంబంధించి లోకాయుక్త పోలీసులు ఇప్పటికే ముఖ్యమంత్రి భార్య పార్వతి బీఎంను ప్రశ్నించారు. మైసూరు భూ కుంభకోణం కేసులో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు లోకాయుక్త బుధవారం విచారణకు సమన్లు జారీ చేసింది. ఈ కేసుకు సంబంధించి లోకాయుక్త పోలీసులు ఇప్పటికే ముఖ్యమంత్రి భార్య పార్వతి బీఎంను ప్రశ్నించారు. లోకాయుక్త ద్వారా ముఖ్యమంత్రిని ప్రశ్నించడానికి అనుమతించే హక్కు గవర్నర్కు ఉందని కోర్టు ప్రకటించిన నేపథ్యంలో సమన్లు వచ్చాయి. ప్రత్యేక కోర్టు ఆదేశాల మేరకు లోకాయుక్త ఇప్పటికే ప్రాథమిక సమాచార నివేదికను దాఖలు చేసింది. నగరానికి సమీపంలోని కేసరే గ్రామంలోని 3.16ఎకరాల భూమికి పరిహారంగా పార్వతికి 14విలువైన ప్లాట్లను కేటాయించడంపై కేసు ముడిపడి ఉంది.

### ఎన్నికల వేళ మహారాష్ట్ర డీజీపీపై

# ఎన్నికల సంఘం బదిలీ వేటు

● ఫోన్లు ట్యాప్ చేసి బీజేపీకి చేరవేశారని ఈసీకి ప్రతిపక్షాల ఫిర్యాదు ● రష్మీ శుక్లా బీజేపీ డీజీపీ అంటూ ప్రతిపక్షాల ఆరోపణ ● రాజకీయ హింస పెరిగింది.. ఘర్షణలు జరుగుతున్నాయి ● ఇలాంటి పోలీసులుంటే ఎన్నికలు సజావుగా ఎలా జరుగుతాయి ?




ముంబయి: మరికొన్ని రోజుల్లో మహారాష్ట్ర లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈక్రమంలోనే రాష్ట్రంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. డీజీపీ పై ఎన్నికల సంఘం బదిలీ వేటు వేసింది. గత ప్రభుత్వ హయాంలో తమ ఫోన్లను ఆమె ట్యాప్ చేసి సమాచారాన్ని బీజేపీకి చేరవేశారంటూ ప్రతిపక్షాలు ఈసీకి ఫిర్యాదు చేయడమే అందుకు కారణం. ఈమేరకు సంబంధిత వర్గాలు సమాచారం వెల్లడించాయి. మహాయతి కూటమి, మహా వికాస్ అఘాడీలపై డీజీపీ రష్మీ శుక్లా పక్షపాతం వహిస్తున్నారని ప్రతిపక్షాలు తీవ్ర వ్యాఖ్యలు చేశాయి. గత ప్రభుత్వ హయాంలో నేతల ఫోన్లను ట్యాప్ చేశారని.. నేతలు ఏం చేయబోతున్నారనేది తెలుసుకొని ఆ సమాచారాన్ని ప్రస్తుత డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడణవీస్కు చేరవేశారంటూ శివసేన (యూబీటీ) నేత సంజయ్రౌత్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఆమెను 'భాజపా డీజీపీ'గా పేర్కొన్నారు. ఆమె కాషాయ పార్టీతో కలిసి పనిచేస్తున్నారని.. ఇలాంటి పోలీసులు ఉంటే త్వరలో రాష్ట్రంలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు సరిగ్గా నిర్వహించలేమని ఆరోపించారు. ఈ విషయంపై ఎంవీఏలోని పార్టీలు ఈసీకి ఫిర్యాదు చేశాయి. గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో ప్రతిపక్షాలపై రాజకీయ హింస పెరిగిందని.. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని ఆరోపించాయి. ఆమెను తొలగించాలని లేఖలో కోరాయి. దీనిపై ఈసీ స్పందించింది. అసెంబ్లీ ఎన్నికల్లో అధికారులు నిష్పక్షపాతంగా, న్యాయంగా వ్యవహరించాలని ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్కుమార్ సూచించారు. తమ విధులను నిర్వహించడంలో పార్టీలకతీతంగా భావించేలా చూడాలన్నారు. కాంగ్రెస్, ఇతర పార్టీల నుంచి ఫిర్యాదుల మేరకు డీజీపీని తొలగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఆమె తదుపరి అర్హత కలిగిన ముగ్గురు ఐపీఎస్ అధికారుల పేర్లను పంపించాలని సీఎస్ను ఆదేశించినట్లు తెలుస్తోంది.

# ఢిల్లీ కాలుష్యంపై సుప్రీం తీవ్ర స్పందన

● బాణసంచా నిషేధం ఎందుకు అమలుచేయలేదు ? ● నిషేధం ఉన్నా బాణసంచా కాల్చడంపై సుప్రీంకోర్టు అసహనం ● ప్రజలు నిషేధాన్ని ఉల్లంఘిస్తుంటే ఏం చేస్తున్నారని నిలదీత ● అఫిడవిట్ దాఖలు చేయాలంటూ.. ఢిల్లీ ప్రభుత్వానికి నోటీసులు జారీ



ఢిల్లీ: దీపావళి తర్వాత ఢిల్లీలో కాలుష్యం పెరగడంపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. దేశ రాజధానిలో బాణసంచా కాల్చడంపై ఉన్న నిషేధం అమలుకావడం లేదని అసహనం వ్యక్తంచేసింది. ఈ ఏడాది నిషేధాన్ని అమలు చేయడానికి ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలియజేస్తూ అఫిడవిట్ దాఖలు చేయాలని ఢిల్లీ ప్రభుత్వం, పోలీసు కమిషనర్కు అత్యున్నత న్యాయస్థానం నోటీసులు ఇచ్చింది. అలాగే వచ్చే ఏడాది నిషేధం అమలు కోసం ప్రతిపాదిత చర్యలు అందులో పొందుపరచాలని ఆదేశించింది."టపాసులపై నిషేధం అమలు చేయలేదని వార్తలు వస్తున్నాయి. కాలుష్యాన్ని నివారించడానికి ఇదొక ముఖ్యమైన చర్యగా భావించాం. బాణసంచా అమ్మకాలు, తయారీ, వాటిని కాల్చడంపై ఉన్న నిషేధానికి సంబంధించి ఇచ్చిన ఆదేశాల వివరాలు అఫిడవిట్లో వెల్లడించండి. నిషేధాన్ని ఉల్లంఘించిన వారిపై తీసుకున్న చర్యలు, కోర్టు ఆదేశాలు అమలు చేయడానికి తీసుకున్న చర్యల వివరాలను ఢిల్లీ పోలీసులు కోర్టుకు సమర్పించాలి" అంటూ నోటీసులు ఇచ్చింది. వాటికి వారం రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని ఆదేశించింది. నిషేధాన్ని ఉల్లంఘించే వారి స్థలాలను సీల్ చేయడం వంటి కఠిన చర్యలు అవసరమని వ్యాఖ్యానించింది. 2025 నాటి దీపావళికైనా ఇలాంటి పరిస్థితి ఉత్పన్నంకాకుండా చర్యలు ఉండాలని సూచించింది.సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్మెంట్ రిపోర్టును ప్రస్తావించింది.గత రెండు సంవత్సరాలతో పోలిస్తే..2024 దీపావళికి వాతావరణంలో వేడి శాతం ఎక్కువగా ఉందని చెప్పింది. పంట వ్యర్థాల కాల్చివేత ఘటనలపై పంజాబ్, హరియాణా ప్రభుత్వాలు నవంబర్ 14లోగా తమ సమాధానాలను కోర్టు ముందు ఉంచాలని ఆదేశించింది.

# గాజాలో మానవతా సహాయానికి ఆటంకం

### యూఎస్తో ఇజ్రాయెల్ ఒప్పందం రద్దు



జెరూసలెం: గాజాకు ఐక్యరాజ్య సమితి(ఐరాస) అందిస్తున్న మానవతా సహాయానికి తీవ్ర ఆటంకం కలిగింది. పాలస్తీనా శరణార్థులకు మానవతా సహాయం నిమిత్తం ఇంతకాలం యూఎన్తో ఉన్న ఒప్పందాన్ని ఇజ్రాయెల్ రద్దు చేసుకున్నట్లుగా అధికారిక వర్గాలు పేర్కొంటున్నాయి. దీని వల్ల ఐరాస నుంచి గాజాకు ఆహారం, మందులు, వైద్యసదుపాయాల కోసం నిధులు కేటాయించడానికి వీలుండదు. ఐక్యరాజ్య సమితి ఏజెన్సీ అయిన యూఎన్ఆర్డబ్ల్యూఏలో హమాస్ చొరబడిందని ఇజ్రాయెల్ ఆరోపించింది. అయితే ఇజ్రాయెల్ వ్యాఖ్యలను యూఎన్ఆర్డబ్ల్యూఏ ఖండించింది. ఆరోపణలపై దర్యాప్తు చేసి, తగిన చర్యలు తీసుకుంటామని తెలిపింది. ఇక తమ దళాలు సిరియాలో భూదాడులు చేసినట్లుగా ఇజ్రాయెల్ ప్రకటించింది. కాగా హమాస్తో యుద్ధం ప్రారంభమయినప్పటి నుంచి ఇజ్రాయెల్ దళాలు సిరియాపై దాడులు చేస్తున్నట్లుగా ప్రకటించడం ఇదే మొదటిసారి. గాజా, లెబనాన్లో కాల్పుల విరమణ ఒప్పందం గురించి అమెరికా, ఇతర ప్రపంచ దేశాల నుంచి ఒత్తిడి వస్తున్నప్పటికీ ఇజ్రాయెల్ దాడులకు పాల్పడుతూనే ఉంది. లెబనాన్ సరిహద్దు ప్రాంతాలను దాటి విస్తరిస్తోంది. అమెరికా విదేశాంగశాఖ కార్యదర్శి ఆంటోని బ్లింకెన్ చొరవతో ఇజ్రాయెల్- హమాస్ వర్గాలు సంధి ఒప్పందానికి వస్తున్నాయి. గాజాలో కాల్పుల విరమణ ఒప్పంద చర్చల్లో తమ నిఘా అధిపతి పాల్గొంటున్నారని ఇటీవల ఇజ్రాయెల్ పేర్కొంది. ఒప్పందం కుదిరితే పోరాటం ఆపేస్తామని హమాస్ వర్గాలు సైతం వెల్లడించాయి. ఓ వైపు ఒప్పందం దిశగా అడుగులు పడుతున్నా.. దాడులు మాత్రం తగ్గకపోవడం గమనార్హం.

# ఉత్తరాఖండ్లో ఘోర ప్రమాదం

● 38 మంది మృతి.. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ● అదుపుతప్పి లోయలో పడిపోయిన బస్సు ● ప్రమాదంపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దిగ్భ్రాంతి ● బాధితులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక సహాయం



నైనిటాల్: ఉత్తరాఖండ్లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. పౌరీ జిల్లాలోని నైనిదండా నుంచి నైనితాల్లోని రాంనగర్కు వెళుతున్న ఓ బస్సు అల్మోరా వద్ద అదుపుతప్పి లోయలో పడింది. ఈ ప్రమాదంలో 36 మంది ప్రయాణికులు మృతి చెందగా, మిగిలినవారు తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు వెల్లడించారు. ఓవర్లోడ్ కారణంగా బస్సు లోయలో పడి ఉంటుందని పోలీసులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయని, క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తున్నామని పేర్కొన్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ప్రమాదంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందిస్తూ... మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేలు చొప్పున ప్రధానమంత్రి సహాయనిధి నుంచి ఆర్థికసాయం అందజేస్తామని ప్రకటించారు. ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. వేగంగా సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తీవ్రంగా గాయపడిన ప్రయాణికులను ఎయిర్లిఫ్ట్ చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.4 లక్షలు, గాయపడిన వారికి రూ.లక్ష చొప్పున ఆర్థికసాయం ప్రకటించారు. ఈ ఘటనపై మెజిస్టీరియల్ విచారణ జరిపించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఆ ప్రాంతంలోని సహాయ ప్రాంతీయ రవాణా అధికారి (ఎన్ఫోర్స్మెంట్)ని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# కశ్మీర్ అసెంబ్లీ స్పీకర్గా అబ్దుల్ రహీమ్

● తొలిరోజు సమావేశంలోనే రసాభాస ● ఆరేళ్ల తర్వాత ప్రారంభమైన అసెంబ్లీలో గందరగోళం ● ఆర్టికల్ 370 రద్దును వ్యతిరేకిస్తూ తీర్మానం ● తీర్మానంపై బీజేపీ సభ్యుల అభ్యంతరం ● ఐదు రోజుల పాటు జరగనున్న సమావేశాలు



శ్రీనగర్: జమ్ము కశ్మీర్ అసెంబ్లీ స్పీకర్ గా నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ ఎమ్మెల్యే అబ్దుల్ రహీమ్ రాథర్ ఎన్నికయ్యారు. సీఎం ఒమర్ అబ్దుల్లా సమక్షంలో ప్రొటెం స్పీకర్ ముబారక్ గుల్.. అసెంబ్లీ స్పీకర్గా అబ్దుల్ రహీమ్ పేరును ప్రతిపాదించారు. కాగా, అబ్దుల్ రహీమ్ రాథర్ ఏడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం బుద్గాం జిల్లాలోని చరార్-ఇ-షరీఫ్ అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పీడీపీ ఎమ్మెల్యే వహీద్ పర్రా ఆర్టికల్ 370 రద్దును వ్యతిరేకిస్తూ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఆ తీర్మానంపై అభ్యంతరం చెబుతూ భాజపా సభ్యులు ఆందోళన తెలిపారు. కాగా అధికారిక నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీకి చెందిన స్పీకర్ రహీమ్ రాథర్ మాట్లాడుతూ అటువంటి తీర్మానాన్ని తాను ఇంకా అంగీకరించలేదని చెప్పారు. దీంతో అసెంబ్లీలో గందరగోళం నెలకొంది. జమ్మూకశ్మీర్లో ఆర్టికల్ 370ని రద్దు చేయడంతో 2019లో ప్రత్యేక ప్రతిపత్తి హోదాను కోల్పోయింది. దీంతోపాటు ఆ రాష్ట్రం రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విడిపోయింది. జమ్మూకశ్మీర్కు తిరిగి రాష్ట్ర హోదా కల్పించాలని ఫరూక్ అబ్దుల్లా నేతృత్వంలోని నేషనల్ కాన్ఫరెన్స్ డిమాండ్ చేస్తోంది. ఒమర్ అబ్దుల్లా కూడా గత అయిదేళ్లుగా అందుకోసమే తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎన్సీ-కాంగ్రెస్ కూటమి విజయం సాధించింది. 90 స్థానాల శాసనసభలో ఎన్సీ 42 సీట్లలో, కాంగ్రెస్ 6 స్థానాల్లో నెగ్గింది. నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. జమ్మూకశ్మీర్కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని కేంద్రాన్ని కోరుతూ ఇటీవల ఒమర్ మంత్రివర్గం తీర్మానం చేసిన సంగతి తెలిసిందే. దానికి లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఆమోదం కూడా తెలిపారు. ఈ పునరుద్ధరణ ప్రక్రియను ప్రారంభించే యోచనలో కేంద్రం ఉందని, ఈమేరకు హామీ లభించిందని పలు మీడియా కథనాలు వెలువడ్డాయి.

# ఆగ్రా వద్ద కూలిన మిగ్-29 విమానం



ఆగ్రా: ఉత్తరప్రదేశ్లోని ఆగ్రా సమీపంలో మిగ్- 29 యుద్ధ విమానం కుప్పకూలింది. ఈ ఘటనలో అప్రమత్తమైన పైలట్ కిందకు సురక్షితంగా బయటపడ్డారు. విన్యాసాల కోసం పంజాబ్లోని అదంపూర్ నుంచి బయల్దేరిన ఈ ఫైటర్ జెట్ ఆగ్రా వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. కుప్పకూలిన చోట విమానం నుంచి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంపై విచారణకు ఆదేశించినట్లు రక్షణ శాఖ అధికారులు తెలిపారు. మిగ్-29 విమానం ఇలా కుప్పకూలిన ఘటనలు గతంలోనూ జరిగాయి. సెప్టెంబర్ 2న రాజస్థాన్లోని బార్మేర్లో శిక్షణ నేపథ్యంలో మిగ్- 29 ఫైటర్ జెట్ కుప్పకూలింది. విమానంలో సాంకేతిక లోపం తలెత్తడంతో అప్రమత్తమైన పైలట్ ఆ విమానం కూలడానికి ముందే సురక్షితంగా బయటపడ్డారు.

# 14 స్థానాల్లో ఉప ఎన్నికల తేదీ మార్పు




ఢిల్లీః కేరళ , ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో 14 అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 13న ఉపఎన్నికలు నిర్వహించనున్నట్లు ఈసీ గతంలో ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, ఆరోజున పలు మతపరమైన కార్యక్రమాల కారణంగా బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ, ఆర్జేడీ సహా పలు రాజకీయ పార్టీలు పోలింగ్ను వాయిదా వేయాలని ఈసీని కోరాయి. సాంస్కృతిక, మతపరమైన కార్యక్రమాల కారణంగా ఓటింగ్ శాతం తగ్గే అవకాశం ఉందని రాజకీయ పార్టీలు ఈసీ దృష్టికి తీసుకెళ్లాయి. వారి అభ్యర్థన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఈసీ ప్రకటించింది.నవంబర్ 13న జరగాల్సిన ఉప ఎన్నికల పోలింగ్ను నవంబర్ 20కి వాయిదా వేస్తున్నట్లు వెల్లడించింది. ప్రభావితమైన 14అసెంబ్లీ నియోజకవర్గాల్లో కేరళలోని పాలక్కాడ్, పంజాబ్లోని దేరా బాబా నానక్, చబ్బేవాల్, గిద్దర్ బాహా, బర్నాల్, యూపీలోని ఖైర్, మీరాపూర్, కుందర్కి, ఘజియాబాద్, కర్హాల్, సిషామౌ, ఫుల్పూర్, కతేహరి, మజావాన్ ఉన్నాయి. ఓట్ల లెక్కింపులో మాత్రం ఎలాంటి మార్పు చేయలేదు.



# అరబిందోకు ఏపీ సర్కార్ షాక్

అమరావతి: 108, 104 వాహనాల సేవల నుంచి అరబిందో సంస్థను తొలగిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఉద్యోగులకు జీతాలు ఇవ్వకపోవడం, సేవల నిర్వహణ సరిగా లేకపోవడం, కనీసం వాహనాల మెయింటెనెన్స్ కూడా చేయకపోవడంతో ఆ సంస్థను 108, 104 సేవల నుంచి తప్పించాలని చంద్రబాబు సర్కార్ నిర్ణయించింది. ఈ మేరకు ఆదేశాలు జారీ చేస్తూ, కొత్తగా బాధ్యతలు అప్పగించేందుకు టెండర్లు పిలవాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. వైసీపీ హయాంలో అడ్డగోలుగా టెండర్లు దక్కించుకున్న అరబిందో సంస్థ 108, 104, 102 ఉద్యోగులకు నరకం చూపించింది. ఈ మూడు పథకాల కింద వాహనాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు రెండు, మూడు నెలలుగా జీతాలు ఇవ్వకుండా వారిని ఇబ్బందులకు గురి చేసింది. అలాగే కొన్నేళ్లుగా వారికి వివిధ అలవెన్సుల కింద చెల్లించాల్సిన రూ.50 కోట్లను సైతం అరబిందో సంస్థ నిలిపివేసింది. దీంతో ఉద్యోగులంతా ఆర్థికంగా అనేక సమస్యలు ఎదుర్కొన్నారు. తమకు రావాల్సిన జీతం, అలవెన్సులు చెల్లించాలని రోడ్డెక్కారు. తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్(102) ఉద్యోగులు ఇప్పటికే నిరసనలు చేస్తుండగా.. 108, 104 ఉద్యోగులూ తాజాగా ఆ సంస్థకు నిరసన నోటీసులు అందించారు. అయితే 108, 104సేవల నుంచి తాము తప్పుకుంటామని అరబిందో సంస్థ 40 రోజుల క్రితమే ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ సీఈవోకు లేఖ రాసింది. సబ్ కాంట్రాక్టును జీవీ కంపెనీ, యునైటెడ్ బి హెల్త్‌కేర్ సంస్థలకు ఇవ్వాలంటూ లేఖలో ఏపీ ప్రభుత్వానికి ఉచిత సలహా కూడా ఇచ్చింది. అయితే ఆ రెండు సంస్థలు అరబిందోకు చెందినవేనని తెలుస్తోంది. సర్వీసులను మెరుగుపరిచేందుకు సబ్ కాంట్రాక్టులను వారికే ఇవ్వాలంటూ అరబిందో సంస్థ లేఖలో బిల్డప్ ఇచ్చింది. తిరిగి తమ సంస్థలకే 108, 104 పనులు దక్కేలా పథకం వేసినట్లు తెలుస్తోంది. అయితే ఈ లేఖను ప్రభుత్వానికి వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పంపలేదు. అరబిందో సంస్థతో చాలా మంది ఆరోగ్య శాఖ అధికారులకు దగ్గరి సంబంధాలు ఉన్నాయి. దీని వల్ల వారు ఆ సంస్థపై అలవిమాలిన ప్రేమ కనబరిచారు. దీనిపై ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కథనం ప్రచురించింది. ఈ మేరకు స్పందించిన ఏపీ ప్రభుత్వం సీరియస్ అయ్యింది. వెంటనే అరబిందో కాంట్రాక్టును రద్దు చేయాలని ఆదేశాలు జారీ చేసింది.

# దేశంలో ఉత్తమంగా ఏపీ క్రీడా పాలసీ

● రాష్ట్రాన్ని క్రీడా కేంద్రంగా మార్చేందుకు నాలుగు లక్ష్యాలతో పాలసీ రూపకల్పన ● ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటా 2 నుంచి 3 శాతానికి పెంచుతూ నిర్ణయం ● ఒలంపిక్స్, ఏషియన్ గేమ్స్ విజేతలకు ఇచ్చే ప్రోత్సాహకం భారీగా పెంపు ● ఒలంపిక్స్‌లో బంగారు పతకం సాధిస్తే ఇచ్చే ప్రోత్సాహకం రూ.75 లక్షల నుండి రూ.7 కోట్లకు పెంపు ● స్పోర్ట్స్ ఫర్ ఆల్ విధానంతో నూతన క్రీడా పాలసీకి సీఎం చంద్రబాబు ఆమోదం




ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధిః రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువస్తోన్న స్పోర్ట్స్ పాలసీపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. అన్ని రాష్ట్రాల కంటే మిన్నగా ఏపి స్పోర్ట్స్ నూతన పాలసీ ఉంటుందని సీఎం అన్నారు. అందరికీ క్రీడలు అనే విధానంతో తీసుకువచ్చిన పాలసీపై అధికారులతో సీఎం చర్చించారు. రాష్ట్రాన్ని క్రీడా కేంద్రంగా మార్చేందుకు నాలుగు మిషన్ ఆబ్జెక్ట్స్ తో పాలసీని సిద్ధం చేశారు. స్పోర్ట్స్ ఫర్ ఆల్, నర్చర్ టాలెంట్, స్పోర్ట్స్ ఎకో సిస్టం, గ్లోబల్ విజిబిలిటీ అనే అంశాల ప్రాతిపదికగా పాలసీని రూపొందించారు. ఈ నాలుగు మిషన్ ఆబ్జెక్ట్స్ లో అందరికీ ఆటలు, టాలెంట్ గుర్తింపు, ప్రపంచ స్థాయి శిక్షణ, ప్రోత్సాహకాలు, క్రీడాకారులకు మద్దతు, ఉద్యోగ భద్రత, ప్రపంచ స్థాయి సౌకర్యాలు, క్రీడా సంఘాలతో సమన్వయం, టెక్నాలజీ వాడకం, ప్రైవేటు రంగంతో కలిసి పనిచేయడం, జాతీయ, అంతర్జాతీయ స్థాయి ఈవెంట్స్ నిర్వహణ, స్పోర్ట్స్ టూరిజం వంటి అంశాలకు ప్రాధాన్యతనిచ్చారు. ఇతర రాష్ట్రాల్లో ఉన్న పాలసీల కంటే మెరుగైన అంశాలను చేర్చారు. గ్రామ స్థాయి నుంచి క్రీడల ప్రోత్సాహకానికి అవసరమైన ప్రణాళికను పొందుపరిచారు. ఇందులో భాగంగా పలు ప్రతిపాదనలకు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. ఇప్పటి వరకు ఉద్యోగాల్లో ఉన్న క్రీడా కోటా రిజర్వేషన్ ను 2 శాతం నుంచి 3 శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. యూనిఫాం సర్వీసెస్ లో 3 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని పాలసీలో ప్రతిపాదించారు. శాప్ లో గ్రేడ్ 3 కోచ్ ల కోసం ఇంటర్నేషనల్ మెడల్స్ సాధించిన వారికి 50 శాతం రిజర్వేషన్ కల్పించనున్నారు. ఒలంపిక్స్, ఏషియన్ గేమ్స్, వరల్డ్ చాంపియన్స్, నేషనల్ గేమ్స్, ఖేలో ఇండియా గేమ్స్, నేషనల్ స్కూల్ గేమ్స్ లో పతకాలు పొందిన వారికి ఇచ్చే ప్రోత్సాహకాన్ని భారీగా పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటి వరకు ఈ ప్రోత్సాహకాల్లో హర్యానా రాష్ట్రం ముందుండగా.....ముఖ్యమంత్రి సూచనలతో కొత్త పాలసీలో అన్ని రాష్ట్రాల కంటే ఎక్కువ ప్రోత్సాహలు ప్రతిపాదించారు.

**పతకాలు సాధించే క్రీడాకారులకు భారీ ప్రోత్సాహకాలు** పతకాలు సాధించే వారికి మంచి ప్రోత్సాహకాలు అందిస్తే క్రీడల పట్ల అందరికీ ఆసక్తి పెరుగుతుందని సీఎం అభిప్రాయపడ్డారు. ఆటలు ఆడేవాళ్లకు గుర్తింపు, గౌరవం ఇవ్వాలని సీఎం అన్నారు. ఒలంపిక్స్ లో బంగారు పతకం సాధించిన వారికి ఇప్పటి వరకు రూ.75 లక్షలు ఇస్తుండగా...దీన్ని ఇకపై రూ.7 కోట్లు ఇవ్వాలని నిర్ణయించారు. అలాగే రజత పతకం సాధించిన వారికి రూ.50 లక్షలు ఇస్తుండగా.....ఇకపై రూ.5 కోట్లు, కాంస్య పతకం సాధించిన వారికి ఇప్పటి వరకు రూ. 30 లక్షలు ఇస్తుండగా ఇకపై రూ.3 కోట్లు ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించారు. అలాగే ఒలంపిక్స్ లో పాల్గొన్న వారికి రూ.50 లక్షల చొప్పున ప్రోత్సాహకం ఇవ్వాలని సీఎం సూచించారు. అదే విధంగా ఏషియన్ గేమ్స్ లో బంగారు పతకం సాధించిన వారికి రూ.4 కోట్లు, రజత పతకం సాధించిన వారికి రూ.2 కోట్లు, కాంస్య పతకం సాధించిన వారికి రూ.1 కోటి చొప్పున ప్రోత్సాహకం ఇవ్వాలని అభిప్రాయపడ్డారు. ఏషియన్స్ గేమ్స్ లో పాల్గొన్న వారికి రూ.10 లక్షలు ఇవ్వాలని సూచించారు. వరల్డ్ ఛాంపియన్ ఫిప్, వరల్డ్ కప్ పోటీల్లో బంగారు పతకం సాధించిన వారికి రూ.50 లక్షలు, రజతం సాధించిన వారికి రూ.35 లక్షలు, కాంస్యం సాధించిన వారికి రూ.25 లక్షలు ఇవ్వనున్నారు. నేషనల్ గేమ్స్ లో బంగారు పథకం సాధించిన వారికి రూ.10 లక్షలు, రజతం సాధించిన వారికి రూ.5 లక్షలు, కాంస్య పథకం సాధించిన వారికి రూ.3 లక్షల ప్రోత్సాహం ఇవ్వాలని ప్రతిపాదనలు చేశారు. ఖేలో ఇండియా గేమ్స్, నేషనల్ స్కూల్ గేమ్స్ లో బంగారు పతకం సాధించిన వారికి రూ.2.50 లక్షలు, రజత పతకం సాధించిన వారికి రూ.2 లక్షలు, కాంస్యం సాధించిన వారికి రూ.1 లక్ష చొప్పున ప్రోత్సాహం ఇవ్వాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఒలంపిక్, ఏషియన్ గేమ్స్ లో పతకాలు సాధించిన వారికి గ్రూప్-1 ఉద్యోగులుగా నియమిస్తామని తెలిపారు. అదే విధంగా స్పోర్ట్స్ సిటీగా అమరావతిని రూపొందించడంతో పాటు తిరుపతి, వైజాగ్, అమరావతిలో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లు ఏర్పాటు చేయాలన్నారు. కడప, విజయవాడ, విజయనగరం క్రీడా పాఠశాలలు ఏర్పాటు చేయాలన్నారు. ఇందులో విజయనగరం క్రీడా పాఠశాల గిరిజనుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలన్నారు. మండల, నియోజకవర్గ స్థాయిలో క్రీడా వికాస కేంద్రాలు, గ్రామ పంచాయతీల్లో క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లో సాంప్రదాయ క్రీడలను ప్రోత్సహించాలన్నారు. ప్రస్తుతం దేశంలో అత్యంత పాపులర్ అయిన స్పోర్ట్స్ లీగ్స్ లో ఏపీ నుండి జట్లు ప్రాతినిధ్యం వహించేలా చూడాలన్నారు. ఏపీకి వరంగా సముద్ర తీరం, కొండలు, అడవులు ఉన్నాయని...మౌంటెయిన్ బైకింగ్, వాటర్ స్పోర్ట్, నేచర్ ఫోటో గ్రఫీ, ట్రెక్కింగ్ వంటి వాటిని ఏర్పాటు చేయాలన్నారు. ఆటలు అంటే క్రికెట్ ఒక్కటే కాదని...అన్ని ఆటలను ప్రోత్సహించాలని సిఎం అన్నారు. ఆటలను తమ గోల్ గా ఎంచుకునేవారికి ఉద్యోగ భద్రత కల్పిస్తే మంచి ఫలితాలు వస్తాయని...ఎక్కువ మంది ఆ వైపు ప్రయాణం చేస్తారని సిఎం అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తీసుకువచ్చిన విధానాల కారణంగా అనేక మంది క్రీడాకారులు తయారయ్యారని...వారు ఒలంపిక్స్ లో కూడా సత్తా చాటారని సిఎం అన్నారు. పిపిపి విధానంతో పాటు....స్వచ్ఛంధంగా ఆసక్తి చూపే వ్యక్తులు, సంస్థల ద్వారా మౌళిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని అన్నారు. ఈ సూచనల ప్రకారం మార్పులు చేసి కేబినెట్ లో నూతన పాలసీ తీసుకురావాలని సీఎం అధికారులను ఆదేశించారు. సమీక్షలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, శాప్ ఛైర్మన్ అనిమిని రవి నాయుడు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# తాడిపర్రు ఘటనపై సీఎం చంద్రబాబు విచారం

**బాధిత కుటుంబాలకు రూ. 5 రూ.5 లక్షల పరిహారం**



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: తూర్పుగోదావరి జిల్లాలో విద్యుదాఘాతంతో నలుగురు మృతి చెందిన ఘటనపై సీఎం చంద్రబాబు నాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఉండ్రాజవరం మండలం తాడిపర్రులో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ సందర్భంగా ఫ్లెక్సీ కడుతూ వీర్రాజు, నాగేంద్ర, మణికంఠ, కృష్ణ అనే నలుగురు మృతి చెందడంపై సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనలో మరో వ్యక్తి తీవ్రంగా గాయపడటం బాధాకరమన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరపున రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు.

**రాజధాని నిర్మాణానికి, అన్నా క్యాంటీన్ నిర్వహణకు ?**

# 10 లక్షల రూపాయల విరాళం



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిది: రాజధాని నిర్మాణానికి, అన్న క్యాంటీన్ నిర్వహణకు, రాయచోటి నియోజకవర్గానికి చెందిన వ్యాపాంస్తులు, వర్తకుల సంఘాలవారు ?10 లక్షల రూపాయ ల విరాళాన్ని అందజే శారు. సంబంధిత చెక్ లను అమరావతి సచివాలయంలో సీఎం చంద్రబాబు నాయుడుకి రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి అందజేశారు

# విద్యార్థుల చదువులే దేశ ప్రగతికి సాధనాలు

● విద్య, క్రీడలు, శాస్త్ర సాంకేతిక రంగాల్లో ప్రగతి సాధన దిశగా అడుగులు ● ఆహ్లాదకర వాతావరణంలో విద్యాభ్యాసం చేసే విధంగా ఏర్పాట్లు ● విద్యార్థులు విజువల్ థింకింగ్ పై దృష్టి సారించాలి ● గొల్లప్రోలు బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ముఖాముఖిలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ● జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ల్యాబ్ ప్రారంభం



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధిః పిఠాపురం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో నంబర్ వన్ చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్టు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. విద్య, క్రీడలు, శాస్త్ర మరియు సాంకేతిక రంగాల్లో ప్రగతి సాధన దిశగా అడుగులు వేస్తున్నట్టు తెలిపారు. సోమవారం ఉదయం పిఠాపురం నియోజకవర్గ పర్యటనలో భాగంగా గొల్లప్రోలులోని బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. స్కూల్లో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన సైన్స్ ల్యాబ్ ని ప్రారంభించారు. అనంతరం 10వ తరగతి విద్యార్థులతో ముఖా ముఖి మాట్లాడారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "పిఠాపురం నియోజక వర్గానికి శాసన సభ్యుడిగా కాకుండా మీలో ఒకడిగా ఒక్క నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తే చాలు అన్న లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాము. నేను చదువుకునే రోజుల్లో నాయకులు ఎలా ఉండాలి అని ఊహించుకున్నానో.. అలా అవ్వాలని ప్రయత్నం చేస్తున్నాను. విద్యార్థులు ఎంత బాగా చదువుకుంటే దేశం అంత అభివృద్ధి చెందుతుంది. ముఖ్యంగా పాఠశాలల్లో మరుగుదొడ్లు, తాగడానికి నీరు, ఆట స్థలాలు బాగుంటే ఆహ్లాదకర వాతావరణంతో విద్యార్థులు బాగా చదువుకుంటారు. విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో క్రీడలు కూడా అంతే ముఖ్యం. మనసు ఎంత బలంగా ఉంటుందో శరీరం కూడా అంతే బలంగా ఉండాలి. అప్పుడే పరిపూర్ణంగా విద్యాభ్యాసం సాధ్యపడుతుంది. విజువల్ థింకింగ్ మీద దృష్టి సారించాలి. డ్రాయింగ్ స్కిల్స్ బాగుంటే చదివిన చదువు కూడా ఎక్కువగా గుర్తు ఉంటుంది. ఉపాధ్యాయులు మైండ్ మ్యాపింగ్ మీద దృష్టి సారించాలి. అవసరం అయితే మైండ్ మ్యాపింగ్ మీద వర్క్ షాపు నిర్వహించాలి" అన్నారు.

**కంప్యూటర్ ల్యాబ్స్ ఏర్పాటుకు హామీ** విద్యార్థులతో ముఖాముఖీ సమావేశంలో భాగంగా శ్రీ పవన్ కళ్యాణ్ గారు తరగతి గదిలోని ప్రతి విద్యార్థి పేరు అడిగి తెలుసుకుని కరచాలనం చేశారు. పాఠశాలకు ఇంకా ఏమైనా సౌకర్యాలు కావాలా అని శ్రీ పవన్ కళ్యాణ్ గారు అడుగగా.. కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేయమని విద్యార్థులు కోరారు. తక్షణం స్కూలు ప్రధాన ఉపాధ్యాయురాలిని పిలిచి కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేయడానికి ఎన్ని కంప్యూటర్లు కావాలని ఆరా తీశారు. త్వరలోనే పిఠాపురం నియోజకవర్గం పరిధిలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ కంప్యూటర్ ల్యాబ్ లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

# పంటల ఎగుమతిపై నిబంధనలు ఎందుకు

● మిల్లర్ల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం పరిష్కరించాలి
● కేంద్ర ఆహార మంత్రితో మాట్లాడి సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేస్తా
● మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధిః పంటల ఎగుమతిపై నిబంధనలు మంచిది కాదని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు తెలిపారు. జాతీయ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో (సోమవారం) సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు మాట్లాడుతూ... తాను ప్రస్తుతం ఏ పదవిలో లేనని చెప్పారు. గతంలో మిల్లర్స్ అసోషియేషన్ సమస్యల పరిష్కారానికి కృషి చేశానని.. అందుకే పిలిచి ఉంటారని అన్నారు. దేశానికి వెన్నుముక రైతులు.. ఆ రైతులతో ఈ రంగానికి అవినాభావ సంబంధం ఉందని అన్నారు. మిల్లర్స్ రంగంలో నెలకొన్న సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు అసోసియేషన్ ప్రతినిధులతో మాట్లాడాలని చెప్పారు. సమస్యలు పరిష్కారం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని అన్నారు. రాత్రి, పగలు కష్టపడి పండించిన పంటను ఎగుమతి చేసేందుకు ఇబ్బందులు ఉండకూడదని చెప్పారు.

**ఏ వస్తువుల ఎగుమతిపై లేని నిబంధనలు. ఒక్క పంటల ఎగుమతి పైనే ఎందుకని ప్రశ్నించారు.** గత 10 రోజుల నుంచి తాను వైరల్ ఫివర్‌తో బాధపడుతున్నానని అన్నారు. కానీ ఈ అసోసియేషన్‌తో ఉన్న అవినాభావ సంబంధం వల్లే నేడు ఇక్కడికి రావడం జరిగిందని తెలిపారు. ఒక సమగ్ర భారత దేశాన్ని ఇక్కడ చూస్తున్నానని అన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి పలువురు సభ్యులు వచ్చారని తెలిపారు. ఏ సమస్యలు ఉన్నాయో వాటికి పరిష్కార మార్గాలను సభ్యులు చర్చించుకోవాలని చెప్పారు. తాను ఢిల్లీకి వెళ్లిన తర్వాత కేంద్ర ఆహార మంత్రితో మాట్లాడతానని చెప్పారు. మిల్లర్ల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని వెంకయ్య నాయుడు పేర్కొన్నారు.

# శ్రీవారి సేవలో హోంమంత్రి అనిత

● టీటీడీ ఈవో శ్యామలరావుతో హోంమంత్రి సమావేశం
● నక్కపల్లి ఉపమాక శ్రీకల్కి వేంకటేశ్వరస్వామి ఆలయాభివృద్ధిపై చర్చ



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధిః తిరుపతి శ్రీవేంకటేశ్వరస్వామిని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత దర్శించుకున్నారు. ఆలయంలోకి వెళ్లిన హోంమంత్రికి టిటిడి అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వదించారు. టీటీడీ అధికారులు శేష వస్త్రం కప్పి స్వామివారి తీర్థ ప్రసాదాలను హోంమంత్రికి అందజేశారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్ర ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని శ్రీవారిని కోరుకున్నట్లు ఆమె పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి దిశగా అడుగులు వేస్తుందన్నారు. టీటీడీ ఈవోని కలిసి ఉపమాక శ్రీకల్కి వేంకటేశ్వరస్వామి ఆలయాభివృద్ధిపై చర్చ శ్రీవారి దర్శనం అనంతరం హోంమంత్రి వంగలపూడి అనిత టీటీడీ ఈవో శ్యామలరావుతో సమావేశమయ్యారు. పాయకరావుపేట నియోజకవర్గం నక్కపల్లి మండలం ఉపమాక గ్రామంలో కొలువై ఉన్న శ్రీ కల్కి వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధిపై హోంమంత్రి చర్చించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో 18-11-2015న టీటీడీలో భాగస్వామ్యమైన ఈ ఆలయానికి సంబంధించి స్వామివారి గర్భగుడి, మూలవిరాట్ ను పునరుద్ధరించాలని కోరారు. ప్రాచీన పుణ్యక్షేత్రమే కాకుండా దశావతారాలలో చివరిదశైన శ్రీ కల్కి వేంకటేశ్వరస్వామిగా దర్శనమిచ్చే ఆలయాలలో ఇదే ఏకైక క్షేత్రమని హోంమంత్రి ఆలయ చరిత్రను, ప్రాశస్త్యాన్ని వివరించారు. 2014 ఆగస్టు 9వ తేదీన నాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వెంకటేశ్వర స్వామి క్షేత్ర దర్శనానంతరం ఆలయ సమస్యలు తెలుసుకుని అభివృద్ధి చేపట్టగా మిగిలిపోయిన పనులను కూడా సత్వరమే పూర్తిచేయాలని ఆమె కోరారు. ముఖమండపం, ఆస్థాన మండపం, రాజగోపురం, నడకదారి, మెట్ల నిర్మాణం వంటి అభివృద్ధి పనులు చేపట్టాలని వినతి పత్రం సమర్పించారు. అలాగే గరుడాద్రి పర్వతంగా పిలిచే కొండ కింద భాగంలోని నారద మహాముని చేతులమీదుగా ప్రతిష్టించిన వేణుగోపాల స్వామి ఆలయంలో కొత్తగా మూడు రాజగోపురాలను ఏర్పాటు చేయాలన్నారు. భక్తుల సౌకర్యార్థం పార్కింగ్ షెడ్లు, కళ్యాణమండపం, రోడ్ల విస్తరణ, అన్నదాన భవనం,గోశాల నిర్వహణ, గోవుల పోషణ, పుష్కరిణిగా భావించే బంధుర సరస్సు, డార్మెటరీ, విశ్రాంతి గదులు,మంచినీటి వసతి, కేశఖండనశాల, పోటు నిర్మాణాలు చేపట్టి శ్రీవారి పారాయణదారులను నియమించి శ్రీకల్కి వేంకటేశుని పురాతన ఆలయానికి పున: వైభవం తీసుకురావాలని హోంమంత్రి అనిత టీటీడీ ఈవో శ్యామలరావుని కోరారు.

# నా కారు ప్రమాదంపై దుష్ప్రచారం

● నా కుమారుడు కారణమన్నట్లుగా రాతలు
● అమెరికాలో ఉన్న మనవడి దగ్గరకు వెళ్లినా వక్రభాష్యాలు
● నమ్మవద్దంటూ విజయమ్మ మరో సంచలన లేఖ!



అమరావతి : వైఎస్ విజయమ్మ సంచలన లేఖ రాశారు. తన కారుకు ప్రమాదంపై దుష్ప్రచారం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. గతంలో విజయమ్మ కారుకు ప్రమాదం జరిగింది. ఇది జగన్ కుట్రే అన్నట్లుగా ఇటీవల సోషల్ మీడియాలో కొన్ని పోస్టులు వైరల్ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో విజయమ్మ స్పందించారు. ఎప్పుడో జరిగిన తన కారు ప్రమాదాన్ని ఇప్పుడు జరిగినట్లుగా ప్రచారం చేస్తున్నారని విజయమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. ఇది తన కుమారుడు జగన్ చేయించినట్లు దుష్ప్రచారం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. తనను అడ్డుపెట్టుకుని నీచ, నికృష్ట రాజకీయాలు చేస్తున్నారన్నారు. రాజకీయ ప్రయోజనం కోసం ఇంతగా దిగజారి ప్రయత్నించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. ఈ వికృత చేష్టలను ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు. ఇకపై ఇలాంటి అసత్య ప్రచారం చేస్తూ చూస్తూ ఊరుకోనని హెచ్చరించారు. అమెరికాలో ఉన్న తన మనవడి దగ్గరకు వెళితే దాన్ని కూడా తప్పుగా చిత్రీకరిస్తున్నారన్నారు. భయపడి తాను విదేశాలకు వెళ్ళిపోయినట్లు దుష్ప్రచారం చెయ్యడం అత్యంత నీతిమాలిన చర్య అని అన్నారు.

# మంత్రి వాసంశెట్టి కి సీఎం క్లాస్

**సభ్యత్వ నమోదులో అలసత్వం పై అగ్రహం**

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధిః ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు శాయశక్తులా శ్రమిస్తున్న నేత. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చేందుకు కృషి చేస్తున్నారు. తాను పరుగులు పెట్టడంతో పాటు ఎమ్మెల్యేలను, మంత్రులను కూడా పరుగులు పెట్టిస్తున్నారు. అలాగే తప్పు చేసిన నాయకుల పట్ల కూడా సీఎం సీరియస్‌గా ఉంటున్నారు. స్వంత పార్టీ నేతలను కూడా క్రమశిక్షణలో ఉండాలని..

ఎలాంటి తప్పు చేయకూడదని గట్టిగానే చెబుతున్నారు. ప్రజలకు సేవ చేయడమే తమ ప్రథమ కర్తవ్యం అని నేతలకు నిర్దేశిస్తున్నారు. తప్పు చేస్తే ఎవరైనా సరే చర్యలు తప్పవని హెచ్చరించారు కూడా. తన మన అనే తేడా లేకుండా సొంత పార్టీ నేతలకు కూడా వార్నింగ్‌లు ఇస్తున్నారు సీఎం. నేతల తీరుతో పార్టీకి ఇబ్బందులు ఎదురైనప్పుడల్లా సీఎం అలర్ట్‌గా ఉంటూ.. పార్టీ ఎమ్మెల్యేలకు, నేతలకు స్వీట్ వార్నింగ్స్ ఇస్తూనే.. హద్దులు దాటుతున్న వారిని ప్రత్యేకంగా పిలిపించి మరీ హెచ్చరిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. తాజాగా ఓ మంత్రికి కూడా గట్టిగా క్లాస్ తీసుకున్నారు సీఎం. ఇంతకీ ఎవరా మంత్రి.. ఎందుకు సీఎం క్లాస్ పీకారో ఇప్పుడు తెలుసుకుందాం. మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు క్లాస్ తీసుకున్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు. టీడీపీ సభ్యత్వ నమోదుకు సంబంధించి మంత్రికి సీఎం గట్టిగానే క్లాస్ తీసుకున్నట్లు తెలుస్తోంది. సభ్యత్వ నమోదులో వెనుకబడి ఉన్నారని.. వేరే రాష్ట్రం నుంచి వచ్చినా ఎమ్మెల్యేను, మంత్రిని చేశానని.. రాజకీయాలపై సీరియస్‌నెస్ లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా మిమ్మల్ని మీరు నిరూపించుకోకపోతే ప్రత్యామ్నాయం చూసుకోవాల్సి వస్తుందంటూ మినిస్టర్‌కు ముఖ్యమంత్రి వార్నింగ్ ఇచ్చారు.


**ఇంతకీ చంద్రబాబు ఏమన్నారంటే**

'సభ్యత్వ నమోదులో అందరికంటే వెనుకబడి ఉన్నావు. రాజకీయాలపై నీకు సీరియస్ తనం రాలేదు. ఫస్ట్ టైం ఎమ్మెల్యేవి, ఫస్ట్ టైం మంత్రివి సభ్యత్వ నమోదులో ఎక్కడున్నావో చూసుకున్నావా. 29% శాతం మాత్రమే సభ్యత్వం నమోదు అయింది. 9000 గాను 2630 మాత్రమే చేశారు. ఫస్ట్ టైం వచ్చావు నీకు పార్టీ చాలా గౌరవించింది. వేరే రాష్ట్రం నుంచి వచ్చిన నీకు ఎమ్మెల్యే ఇచ్చి మంత్రిని చేశాం. నీకు పట్టుదల లేకపోతే ఎలా . సీరియస్‌గా తీసుకోవాలి.

నా బాధ్యత నేను చేస్తున్న మీ వాయిస్ మీరు చేయాలి. పార్టీకి ఉపయోగపడకపోతే రాజకీయాలు ఎందుకు. మీరు పని చేయకపోతే ఎమ్మెల్యేగా ఎలా ప్రూవ్ చేసుకుంటారు. మీరు ప్రూవ్ చేసుకోకపోతే ఆల్టర్నేట్ చూసుకుంటా. ఎక్స్పెక్టేషన్స్‌కు తగ్గట్టు పని చేయలేదని ప్రజలకు కూడా తెలియజేస్తా. నేను 95 సీఎంని అని అందరికీ చెప్తున్నా" అంటూ మంత్రి వాసంశెట్టి శుభాష్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గట్టిగానే క్లాస్ తీసుకున్నారు. ఈ వ్యవహారం పార్టీతో పాటూ రాష్ట్ర వ్యాప్తంగా కూడా చర్చనీయాంశంగా మారింది.

# అమరావతి అభివృద్ధి పనులకు తొలగిన అడ్డంకులు


● సాంకేతిక కమిటీ నివేదికలోని 23 ప్రతిపాదనల ప్రకారం పాత టెండర్లు క్లోజ్ ● హైకోర్టు, అసెంబ్లీ మినహా మిగతా పనులకు డిశంబరు 31 లోపు నూతన టెండర్లు ● హైకోర్టు, అసెంబ్లీ భవన నిర్మాణాలకు జనవరి లోపు నూతన టెండర్లు
● రానున్న మూడేళ్లలో అమరావతి అభివృద్ధి పనులు అన్నీ పూర్తి
● రాష్ట్ర పురపాలక & పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ




ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధిః అమరావతి అభివృద్ధి పనులకు అడ్డంకిగా ఉన్న పాత టెండర్లను క్లోజ్ చేసే మార్గం సుగమం అయ్యిందని, త్వరలోనే నూతన టెండర్లను పిలిచే ప్రక్రియను ప్రారంభించి రానున్న మూడేళ్లలో అమరావతి అభివృద్ధి పనులను అన్నింటినీ పూర్తి చేస్తామని రాష్ట్ర పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు అధ్యక్షతన 39 వ సీఆర్డీఏ సమావేశం రాష్ట్ర సచివాలయంలో జరిగిందని... ఈ సమావేశంలో రాజధాని అమరావతి అభివృద్ధి పనులకు సంబంధించి పలు నిర్ణయాలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. అమరావతి అభివృద్ధి పనులకు సంబందించి 2014-19 మధ్యకాలంలో రూ.41 వేల కోట్ల విలువైన టెండర్లను పిలిచి, వాటిలో దాదాపు రూ.35 వేల కోట్ల విలువైన పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. వీటిలో హైకోర్టు, అసెంబ్లీ భవనాలతో పాటు ప్రధాన రహదారులు,ఇతర రహదారులు, హైకోర్టు జడ్జిలు, మంత్రులు, అధికారుల వసతి గృహాల నిర్మాణాలకు సంబందించిన పలు పనులను చేపట్టడం జరిగిందన్నారు. అయితే గత ప్రభుత్వం మూడు రాజధానులు అంటూ ఈ పనులన్నింటినీ నిర్వహించేందుకు ఏమాత్రము శ్రద్ద చూపకుండా వదిలేయడం జరిగిందన్నారు. పనులను ప్రారంభించిన పలు కాంట్రాక్టు ఏజన్సీలు నిర్వహించిన పనులకు కూడా బిల్లులను చెల్లించకుండా పెద్ద ఎత్తున బకాయిలను పెట్టడం జరిగిందన్నారు. ఈ పాత టెండర్లకు సంబందించిన పలు సమస్యలను పరిష్కరించిన తదుపరే నూతన టెండర్లను పిలవాలనే ఉద్దేశ్యంతో పాత టెండర్లను క్లోజ్ చేసేందుకు విధి విధానాలను రూపొందించేందుకై చీఫ్ ఇంజనీర్లతో కూడిన సాంకేతిక కమిటీని జూలై 24 న ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దాదాపు 23 పాయింట్లతో అక్టోబరు 29 న ఆ కమిటీ ఒక నివేదికను ప్రభుత్వానికి అందజేయడం జరిగిందన్నారు. నేటి సీఆర్డీఏ సమావేశంలో ఆ నివేదికపై పూర్తి స్థాయిలో చర్చించిన తదుపరి ఆమోదం తెల్పడం జరిగిందన్నారు. కమిటీ సిఫార్సు చేసిన 23 ప్రతిపాదనల ప్రకారం పాత టెండర్లను అన్నింటినీ క్లోజ్ చేసిన తదుపరి నూతన టెండర్లను పిలవడం జరుగుతుందన్నారు. హైకోర్టు, అసెంబ్లీ మినహా మిగతా పనులకు డిశంబరు 31 లోపు మరియు హైకోర్టు, అసెంబ్లీ భవన నిర్మాణాలకు జనవరి లోపు నూతన టెండర్లను పిలవడం జరుగుతుందని మంత్రి తెలిపారు. రానున్న మూడేళ్లలో అమరావతి అభివృద్ధి పనులు అన్నీ పూర్తి చేయడం జరుగుతుందని, ఐదేళ్లలో ప్రపంచంలోని ఐదు ఉత్తమ నగరాల్లో అమరావతి ఒకటిగా విరాజిల్లుతుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. అమరావతి అభివృద్ధి పనులకు సంబందించి ప్రపంచ బ్యాంక్ రూ.15 వేల కోట్లు ఇవ్వడానికి అంగీకారం తెలిపిందని, అయితే వరద నివారణా పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ఆ బ్యాంకు ప్రతినిధులు కోరడం జరిగిందన్నారు. అందుకు తగ్గట్టుగా అమరావతి రాజధాని 217 చ.కి. కోర్ క్యాపిటల్ పరిధిలోను మరియు బయట పలు చోట్ల రిజర్వాయర్లు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. క్యాపిటల్ సిటీ పరిధిలో కొండవీటి, పాలవాగు, గ్రావిటీ కెనాల్ రిజర్వాయర్లను మరియు క్యాపిటల్ సిటీకి బయట నీరుకొండ, కృష్ణాయపాలెం, శాఖమూరు మరియు ఉండవల్లి ప్రాంతాల్లో స్టోరేజ్ రిజర్వాయర్లను నెదర్లాండ్ డిజైన్ల ప్రకారం నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు.అమరావతి చుట్టూ బైపాస్ రహదారులు నిర్మాణం జరుగుతున్నప్పటికీ గతంలో నిర్ణయించిన ప్రకారం ఇన్నర్ రింగ్ రోడ్డు,ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం చేస్తామన్నారు.

# ప్రజలపై విద్యుత్ చార్జీల భారం

● మళ్లీ ట్రూ అప్ ఛార్జీల పిడుగు
● రూ. 11,826 కోట్ల ప్రతిపాదనలు పంపిన డిస్కమ్‌లు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధిః ఆంధ్రప్రదేశ్ ప్రజలకు బిగ్ షాకింగ్ వార్త ఇది. రాష్ట్ర ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం పడనుంది. వైసీపీ పాపాల ఎఫెక్ట్.. ఇప్పుడు ప్రజలపై పడనుంది. విద్యుత్ వినియోగదారుల నెత్తిన మళ్లీ ట్రూ అప్ ఛార్జీల పిడుగు పడనుంది. ఇంధన సర్దుబాటు ఛార్జీల కింద డిస్కమ్‌లు రూ. 11,826 కోట్ల ప్రతిపాదనలను ఈసీకి పంపాయి. 2023-24 సంవత్సరానికి సంబంధించి ఈఆర్‌సీకి ఈ ప్రతిపాదనలు పంపాయి డిస్కమ్‌లు. అయితే, డిస్కమ్‌ల ప్రతిపాదలను ఏపీఈఆర్‌సీ ఇప్పుడు బహిర్గతం చేసింది. ప్రతిపాదనలపై ఈ నెల 19వ తేదీ లోగా లిఖిత పూర్వక అభ్యంతరాలు తెలియజేయాలని ఈఆర్‌సీ కోరింది. ఇప్పటికే 2022-23 ఇంధన సర్దుబాటు పేరిట రూ. 6,200 కోట్లకు ఈఆర్‌సీ ఆమోదం తెలిపింది. అయితే, ఈ ప్రతిపాదనలపై వామపక్ష పార్టీలు, విద్యుత్ వినియోగదారుల సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ధరలు పెంచి ప్రజలపై మరింత భారం మోపడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేస్తున్నారు.



## కాల సర్ప దోష నివారణ మార్గం

# నాగుల చవితి

- మన జీవనక్రమం తెలిపే నాగుల ఆరాధన
- కాల సర్ప దోషం మాయమవుతుందని విశ్వాసం

**హిందూ మత విశ్వాసాల ప్రకారం, ప్రతి ఏడాది కార్తీక మాసంలో పౌర్ణమికి ముందు వచ్చే చవితి తిథి రోజున నాగ పంచమి, నాగుల చవితి వేడుకలు జరుపుకుంటారు. హిందూ పురాణాల ప్రకారం, శివయ్య మెడలో సర్పాన్ని ధరించి తిరుగుతాడు. శ్రీ మహా విష్ణువు శేషనాగుపై నిద్రిస్తారు. అందుకే నాగదేవత (పాము)లకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. స్కంద పురాణంలో నాగ పంచమి ప్రాధాన్యత గురించి సాక్షాత్తు ఆ ఈశ్వరుడు వివరించినట్లు శాస్త్రాల ద్వారా తెలుస్తోంది. అందుకే పాములను పరమేశ్వరుని అంశంగా భావించి ప్రత్యేక పూజలు చేస్తుంటారు. మరీ ముఖ్యంగా నాగపంచమి, నాగుల చవితి వంటి ప్రత్యేకమైన రోజుల్లో లేదా ఏదైనా శుభకార్యాలు నిర్వహించేటప్పుడు పుట్టకు వెళ్లి ప్రత్యేకమైన పూజలను చేస్తారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది నవంబర్ 5వ తేదీన మంగళవారం నాడు నాగుల చవితి పండుగను జరుపుకోనున్నారు. మరిన్ని వివరాలలోకి వెళితే...**

ఆశ్లేష,ఆరుద్ర, మూల, పూర్వాభాద్ర, పూర్వాషాడఅను ఈ ఐదు నక్షత్రములుసర్ప నక్షత్రములు. సర్పము అనగా కదిలేది, పాకేది.నాగములో 'న, అగ' ఎప్పుడూ కదులుతూ ఉండేదని అర్థం. క్షణం కూడా ఆగకుండా అతివేగంగావెళ్ళేదాన్ని 'నాగము' అంటారు. అన్నింటికంటేవేగంగా వెళ్ళేది 'కాలము' కావున నాగమునకు మరో అర్థం కాలం.అందుకే 'కాలనాగము' లేదా 'కాలనాగు' అని అంటారు. జ్యోతిష్యశాస్త్రానుసారం కాల సర్ప దోషం ఉన్నవారికి జీవనక్రమంలో ఎన్నో అవరోధాలు ఏర్పడుతాయి. జీవితంనిరంతరం కొనసాగే ప్రక్రియ అనగా 'నాగం'.సర్పము హృదయ భాగంతో పాకుతూఉంటుంది. ఈ భాగాన్ని 'ఉరా' అంటారు కావున సర్పానికి 'ఉరగము' అని కూడ పేరు.ఉరమున ఉన్న మనస్సు చెప్పినట్టునడిచే వాళ్ళమైన మనమూ కూడా 'ఉరగముల'మే.సర్పం తాను నిరంతరం సాగుతూ మన జీవనక్రమంలోని వివాహం, సంతానం వంటి జీవన ఘట్టాలనుఅవరోధపరస్తుంది కావున కార్తిక మాసంలో నాగులను ఆరాధిస్తారు. అగ్నిదేవతగా ఉండేది కార్తికమాసములోనే. జీవనానికి కావాల్సినఉత్సాహం, ఉత్తేజం వంటివి తేజస్సు వలన అనగా సూర్యుడు, అగ్ని వలన కలుగుతాయి. శ్రీహరికిశయ్య, శంకరునికి ఆభరణము కూడా సర్పమే కావుననాగులను ఆరాధించడం వలన హరిహరులను సేవించినఫలం దక్కుతుంది. కార్తికమాసమంతా ఇంట్లో నాగ ప్రతిమను ఆరాధిస్తూ,నాగస్తుతిని చేస్తే పరమాత్మ అనుగ్రహిస్తాడు. కార్తికమాసంనెలరోజులు కాకపోయినా కనీసం కార్తిక శుద్ధ చవితినాడు నాగులను ఆరాధించాలి. చవితి అంటే నాల్గవది అనగాధర్మార్థకామమోక్ష పురుషార్థాలలో నాల్గవది మోక్షం కావున ఆనాడు నాగులను ఆరాధిస్తే మోక్షము లభిస్తుంది. అంటే జీవితంలో వచ్చినకష్టాల నుండి విముక్తులవుతాము. కావున నాగుల చవితినాడు దేవాలయాలలో, గృహములో లేదా పుట్టల వద్దనాగ దేవతను ఆరాధించాలి. ప్రకృతిమానవుని మనుగడకు జీవనాధరమైనది కనుక దానిని దైవస్వరూపంగా భావించి మన పూర్వీకులు చెట్టును,పుట్టను, రాయిని, రప్పను, కొండను, కోనను, నదిని, పర్వతాన్ని ఇలా సమస్త ప్రాణికోటినిదైవ స్వరూపంగా చూసుకొంటూ పూజిస్తూ వస్తున్నారు. ఇదే మనభారతీయ సంస్కృతిలోనిహిందువుల పండగల విశిష్టత.

## పాములు కూడా పూజ్యనీయమైనవే

నిశితంగా పరిశీలిస్తే... అందులో భాగంగానే "నాగుపాము" ను కూడా నాగరాజుగా,నాగదేవతగా పూజిస్తూ వస్తున్నారు. ఈ రోజున ఊరిలో ఉన్న గుళ్ళలో ఉన్నపుట్టలలో కానీ లేదా ఊరిబయట ఉన్న పాము పుట్టలోపాలు పోస్తారు. పుట్టలో పాలు పోయటమనేది భారతదేశంలో అనాదిగా వస్తున్న ఆచారం. సిటీ ప్రాంతంలో నాగులచవితికి అంత సందడిగా కనిపించదుకానీ గ్రామీణ ప్రాంతాలలో మాత్రం ఎంతో సందడి సందడిగాకనిపిస్తుంది. దేవాలయాల్లోరాతి విగ్రహా జంట పాముల ప్రతిమలు,రెండు పాములు మెలికలు వేసుకొని రావి, వేప చెట్ల కిందదర్శనం ఇవ్వటం మనము ఎక్కువ గమనిస్తుంటాము.చవితి నాడు సర్పాలను పూజిస్తేసర్వరోగాలు, వైవాహిక దాంపత్య దోషాలు, గర్భదోషాలు పోయి ఆరోగ్యవంతులవుతారని భక్తులు విశ్వాసంతో పుజిస్తారు. ఎందుకంటేకుజ దోషం, కాలసర్ప దోషానికి అధిదేవత సుబ్రహ్మణ్య స్వామి కాబట్టి నాగుపాము పుట్టకు పూజ చేస్తే కళత్రదోషాలు తొలగుతాయని శాస్త్రాలు సూచిస్తున్నాయి.

**కార్తీక మాసం శుక్ల పక్ష శుద్ధ చవితి తిథిని నాగుల చవితి పండగగా జరుపుకుంటారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో నాగుల చవితి వేడుకను ఘనంగా జరుపుకుంటారు. ఈ రోజున భక్తులు పాము పుట్టలో పాలు పోస్తారు. తమని తమ సంతానాన్ని చల్లగా చూడమంటూ నాగదేవతను వేడుకుంటారు. ఈ నెల 5వ తేదీ మంగళవారంన అంటే రేపు నాగుల చవితి పర్వదినం సందర్భంగా తిరుమలలో ఘనంగా వేడుకలను నిర్వహించనున్నారు. శ్రీ మలయప్పస్వామివారు ఉభయ దేవేరులతో కలిసి పెద్దశేష వాహనంపై రాత్రి 7 నుండి9 గంటలవరకు దర్శనమివ్వనున్నారు. సర్పరాజైన ఆదిశేషువు జగన్నాథునికి నివాస భూమిగా, తల్పంగా, సింహాసనంగా స్వామివారికి విశేష సేవలందించినట్లు పురాణాలు చెబుతున్నాయి. అందుకే స్వామివారి బ్రహ్మోత్సవ వాహన సేవలలో కూడా తొలి ప్రాధాన్యత ఆదిశేషునికే ప్రసాదించాడు.**

## ఒక్కో ప్రాంతంలో ఒక్కోలా...

మన దేశంలో ఒక్కోచోట ఒక్కో విధంగా నాగులచవితిని జరుపుకుంటారు. కొన్ని ప్రాంతాల వారు దీపావళి అమావాస్యతరువాత వచ్చే కార్తీక శుద్ధ చతుర్థిని నాగుల చవితి పండుగ జరుపుకుంటారు. కొందరుశ్రావణ శుద్ధ చతుర్థినాడు జరుపుకుంటారు.ఇవి రైతులకు కూడాఎంతో మేలును చేకూరుస్తాయిఈ పాములు భూమి అంతర్భాగమందు నివసిస్తూభూసారాన్ని కాపాడే ప్రాణులుగా సమస్త జీవకోటికి "నీటిని" ప్రసాదించే దేవతలుగా తలచేవారు. ఇవి పంటలను నాశనం చేసేక్రిమికీటకాదులను తింటూ, పరోక్షంగా రైతు కు పంటనష్టం కలగకుండాచేస్తాయట!. అలా ప్రకృతి పరంగాఅవి మనకు ఎంతో సహాయపడుతూ ఉంటాయి. భారతీయసనాతన సంప్రదాయాల్లో జంతు పూజ ఒకటి. ఈశ్వరాంశ ప్రతి ప్రాణిలోనూ వ్యాపించి ఉన్నదని ఉపనిషత్ ప్రబోధం. ప్రకృతి పరిరక్షణకు తోడ్పడే సద్భావన అది. వేదంలో నాగపూజ కనిపించకున్నా- సంహితల్లో, బ్రాహ్మణాల్లో ఆ ప్రసక్తి వస్తుంది.

## ఇతిహాస గాథల్లో



పురాణ, ఇతిహాసాల్లోని గాథల్లో సర్పాలు వివిధ సందర్భాల్లో ప్రత్యక్షమవుతాయి. ఈ రోజునే తక్షకుడు,కర్కోటకుడు,వాసుకి, శేషుడు మొదలైన 100 మంది నాగ ప్రముఖులు జన్మించారని పురాణ కథనం. భూలోకానికి క్రింద ఉన్న అతల, వితల,సుతల, తలాతల, రసాతల, మహాతల, పాతాళ లోకాలల్లో వివిధ జీవరాసులు నివసిస్తాయి. వాటిలోఐదు రసాతల లోకాల్లో రాక్షసులు నివసిస్తారు. చివరిదైన పాతాళ లోకంలో నాగులు ఉంటాయి. నాగప్రముఖులందరూ అక్కడ ఉంటారు. ఈరోజున నాగులకు ఆహారం అందజేస్తే నాగదోషం సహా మొదలైన దొషాలుతొలగిపోతాయి. కద్రువనాగ మాత. మహా విష్ణువుకు శయ్యగాఅమరిన ప్రాణి ఆదిశేషువు. సర్పం పరమశివుడి కంఠాన మనోహర ఆభరణం. సూర్యభగవానుడి రథానికి సర్పమే పగ్గం. అదే- ఆకాశం మధ్యవెలసిన కుజగ్రహానికి కుదురు. భైరవుడి భుజంపై వేలాడే యజ్ఞోపవీతం సర్పమే. శనిదేవుడి చేతిలోని ఆయుధమూ అదే. సర్పమే మంథరపర్వతానికి కవ్వపు తాడుగా మారింది. దేవతలకు, రాక్షసులకు సముద్ర మథన సమయంలో సహాయకారిగాఉపయోగపడింది.

## సంతాన ప్రాప్తికోసం

దంపతులకుసంతానం కలగకపోవడానికి ప్రాచీన, ఆధునిక వైద్య శాస్త్రాలు పలు కారణాలు చెబుతాయి.సర్పదోషమే కారణమని భావించినవారు రామేశ్వరం వెళ్లి నాగప్రతిష్ఠ చేయడం రివాజు. అక్కడికి వెళ్లలేనివారు తమ గ్రామ దేవాలయప్రాంగణంలోనే సర్ప విగ్రహాల్ని ప్రతిష్ఠించేపద్ధతి ఉంది. మన ప్రాచీన దేవాలయాలచుట్టూ శిథిలమైన నాగ విగ్రహాలు ఇప్పటికీదర్శనమిస్తుంటాయి. వర్షకాలంలోపాములు పుట్టల్లో నుంచి బయటకు వచ్చి సంచరిస్తాయి. అందుకే శ్రావణ మాసంలో సైతం 'నాగ పంచమి' పేరుతో పండుగ చేసుకుంటారు. పుట్ట వల్ల భూమిలో తేమపెరుగుతుంది. పంటలకు ఇది ఎంతో అవసరం. పంటలకు మూలం పాములే కాబట్టి,రైతులు వాటిని దేవతలుగా భావిస్తుంటారు. పంటలు ఏపుగా పెరిగే కాలంలో 'కార్తిక శుద్ధ చవితి'నాడు మనం 'నాగులచవితి'ని పర్వదినంగా ఆచరిస్తున్నాం

## జరత్కారుడు.. కథ

పాములకుప్రాణదానం చేసిన ఆస్తీకుడి కథ భారతంలో ఉంది. ఇతడు జరత్కారువు అనే నాగజాతి స్త్రీకిజన్మిస్తాడు. జనకుడి పేరు జరత్కారుడు. చిన్నతనంలోనేసకల విద్యలూ నేర్చుకున్న ఆస్తీకుడు గొప్ప జ్ఞాని అవుతాడు!పరీక్షిత్తుపాముకాటు వల్ల మరణిస్తాడు. ఇందుకుఆగ్రహించిన అతడి పుత్రుడు జనమేజయుడుసర్వ సర్ప జాతీ నాశనంకావాలని సర్పయాగం ప్రారంభిస్తాడు. ఎక్కడెక్కడినుంచో పాములు వచ్చి యాగాగ్నిలో పడి మాడిపోతాయి. మిగిలినసర్పాలు తమను రక్షించాలని జరత్కారువునుప్రార్థిస్తాయి. రాజును ఒప్పించి సర్పయాగం ఆపించాలని ఆమె తన కుమారుడు ఆస్తీకుణ్ని కోరుతుంది. అతడు జనమేజయుడి వద్దకువెళ్తాడు. అతడి విద్యానైపుణ్యాన్ని చూసిన జనమేజయుడుసత్కరించడానికి సిద్ధపడతాడు. 'సర్పహింస మంచిది కాదు. నీవు ఈ యాగంమాని, వాటిని రక్షిస్తే చాలు. అదే నాకు పెద్దసత్కారం' అంటాడుఆస్తీకుడు. జనమేజయుడు అందుకు అంగీకరించి, సర్పయాగాన్ని విరమిస్తాడు. నాగుల చవితినాడు ఈ కథ వింటే,నాగ దోషాల నుంచి విముక్తి కలుగుతుందని పలువురి నమ్మకం.

## రైతులకు బాంధవిగా

పంటపొలాలకు శత్రువులు ఎలుకలు. వాటిని నిర్మూలించేవి పాములు. అవి క్రమంగా కనుమరుగైతే,మానవాళి మనుగడకే ప్రమాదం. నాడు ఆస్తీకుడు వంటివిజ్ఞాని ప్రబోధం వల్ల జనమేజయుడు ప్రభావితుడయ్యాడు.అదే ఉద్బోధతో మన కర్తవ్యాన్ని గుర్తుచేస్తుందినాగుల చవితి పండుగ! ఈ నాగుల చవితి నాడు నాగేంద్రుని శివునికివాసుకిగా, విష్ణువుకు ఆది శేషుడుగా తోడుఉంటాడు కాబట్టి ఈ చవితి రోజు విశ్వాసం గల భక్తుల పూజనైవేద్యాలను సమర్పిస్తే సర్వరోగాలు పోయి సౌభాగ్యవంతులవుతారని భారతీయుల నమ్మకం.



## పుట్టలోపాలు

ఈ నాగుపాము పుట్టలోపాలు పోయుటలోగల అంతర్యమని కొంత మంది పెద్దలమాటల ద్వార తెలుస్తుంది. నాగులకుపాలు పోయడంలోని అంతరార్థం :పాలుస్వచ్ఛతకు ప్రతీక. ఈ పాలను వేడిచేసి చల్లపరచి దానికి కొద్దిగా చల్లను చేరిస్తే పెరుగవుతుంది. ఆ పెరుగును చిలుకగావచ్చిన చల్లలో నుంచి వచ్చే వెన్నను కాయగా నెయ్యి అవుతుంది. దీనిని మనం యజ్ఞంలో హవిస్సుగా ఉపయోగిస్తాం. అలాగే మన బ్రతుకనే పాలనుజ్ఞానమనే వేడితో కాచి వివేకమనే చల్లకలిపితే సుఖమనే పెరుగు తయారవుతుంది. ఈ పెరుగును ఔదార్య మనేకవ్వంతో చిలుకగా శాంతి అనే చల్ల లభిస్తుంది. ఆ చల్లను సత్యం, శివం, సుందరం అనే మూడు వేళ్ళతోకాస్త వంచి తీస్తే సమాజ సహకారం అనే వెన్న బయటకువస్తుంది. ఆ వెన్నకు భగవంతుని ఆరాధన అనే జ్ఞానాన్ని జోడిస్తేత్యాగము, యోగము, భోగమనే మూడు రకముల నెయ్యిఆవిర్భవిస్తుంది. ఇదే సకల వేదాలసారం, సకల జీవనసారం అయిన పాలను జీవనమునకుప్రతీక అయిన నాగులకు అర్పించడంలోని అంతరార్థం. "దేవా:చక్షుషా భుంజానా: భక్తాన్ పాలయంతి" అనేది ప్రమాణ వాక్యం, అనగా దేవతలు ప్రసాదాన్ని చూపులతోనే ఆరగిస్తారని అర్థం. పాములు పాలు తాగవనే అపోహతో పాలు పోయడం మానకుండా కొద్దిగా పాలను పుట్టలో పోసి మిగిలిన పాలనునైవేద్యంగా స్వీకరించాలి. పాముపుట్టలో పాలుపోసేటప్పుడు ఇలాచేప్పాలి మరియు పిల్లలు చేత చెప్పించాలి .నడుముతొక్కితే నావాడు అనుకోపడగతొక్కితే పగవాడు కాదు అనుకోతోకతొక్కితే తోటి వాడు అనుకోనా కంట నువ్వుపడకు నీకంటనేను పడకుండా చూడు తండ్రీ అనిచెప్పాలి. ప్రకృతినిపూజిచటం మనభారతీయుల సంస్కృతి. మనంవిషసర్పమును కూడా పూజించి మనశత్రువును కూడా ఆదరిస్తాము. అనిఅర్థము. . పిల్లల చేత ఇవి చెప్పించటంఎందుకంటె వారికి మంచి అలవాట్లు నేర్పించటం ముఖ్యవుద్దేశము. మనలను ఇబ్బంది పెట్టినవారిని , కష్టపెట్టేవారిని క్షమించాలి అని తెలుపుట ఇలాంటివినేర్పుట ఉద్దేశము. నాగుల చవితిరోజు పుట్టలో పాలుపోసిన తరువాత. బియ్యంరవ్వ లేదా పిండిని చుట్టూజల్లుతారు ఎందుకంటే మన చుట్టూ వుండేచిన్న చిన్న జీవులుకు ఆహారంను పెట్టటం అన్నమాట. ఉదాహరణకు చీమలకు ఆహారంగా పెడుతున్నాం. పుట్టనుండి మట్టి తీసుకొని ఆ మన్నును చేవులకుపెడతారు.

ఎందుకంటే చెవికి సంభందించిన ఇబ్బందులు రాకూడదని శ్రీ వేంకటేశ్వరస్వామి సహస్రనామాలతో శేషసాయి, శేషస్తుత్యం, శేషాద్రి నిలయం అంటూ నిత్య పూజలు అందుకుంటు న్నారు. అటు రామావతారంలో లక్ష్మణుడిగా, కృష్ణావతారంలో బలరామునిగా స్వామివారికి అత్యంత సన్నిహితునిగా వ్యవహరించే ఆదిశేషువు శ్రీ వైకుంఠంలోని నిత్యసూరులలో ఆద్యుడు. స్వామివారు, దాసభక్తికి మారురూపంగా నిలిచే తన ప్రియ భక్తుడైన శ్రీ ఆదిశేషుడిపై ఉభయదేవేరులతో కూడి తిరువీధులలో రేపు విహరించనున్నారు. నాగుల చవితి సందర్భంగా పేద శేష వాహనంపై భక్తులకు దర్శనం ఇస్తూ అభయమివ్వడమే కాకుండా శరణాగతి ప్రపత్తిని కూడా సాక్షాత్కరింపచేయనున్నాడు శ్రీవారు.





## ఆ వైట్ బాల్ క్రికెట్ అప్రోచ్.. టెస్టులకు పనికిరాదు..: రోహిత్‌కు డీకే సూచన

సొంతగడ్డపై తొలిసారిగా టెస్టు సిరీస్ను 0-3 తేడాతో అవమానకర రీతిలో ఓడటంతో టీమ్ఇండియాపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా వేళ్లన్నీ సారథి రోహిత్ శర్మ వైపే చూపిస్తున్నాయి. ఈ సిరీస్లో పేలవమైన ప్రదర్శనతో తీవ్రంగా నిరాశపరిచాడు అతడు. గత కొంతకాలంగా టెస్టుల్లో ఫామ్ లేక ఇబ్బంది పడుతున్నాడు. ఈ నేపథ్యంలో రోహిత్ ఎక్కడ తప్పులు చేస్తున్నాడో అతడి సహచరుడు దినేశ్ కార్తిక్ వివరించాడు. పలు సలహాలూ ఇచ్చాడు.
రోహిత్ టెస్టుల్లో గత 10 ఇన్నింగ్స్లో చేసిన పరుగులు 133 మాత్రమే. దూకుడుగా ఆడేందుకు వెళ్లి వికెట్ సమర్పించుకుంటున్నాడు. న్యూజిలాండ్తో జరిగిన ఆఖరి టెస్టు రెండో ఇన్నింగ్స్లో పెద్ద షాట్ ఆడేందుకు ప్రయత్నించి పెవిలియన్ చేరాడు. దీనిపై డీకే స్పందిస్తూ.. ఇలాంటి అప్రోచ్ వైట్ బాల్ క్రికెట్లో ఆరంభంలో అతడికి గొప్ప ఫలితాలిచ్చిందేమో కానీ.. టెస్టుల్లో తన వైఖరిని మార్చుకోవాల్సిన అవసరం ఉందని సూచించాడు.
ఆ కంఫర్ట్ జోన్ నుంచి రోహిత్ బయటకు రావాలని.. టెస్టుల్లో పెద్ద షాట్లు ఆడకుండా ఉండాలని కార్తిక్ పేర్కొన్నాడు. టెస్టుల్లో ఇబ్బందుల్లో ఉన్నప్పుడు దూకుడుగా ఆడాలని రోహిత్ భావిస్తున్నాడని నేను అనుకుంటున్నా. వైట్ బాల్ క్రికెట్లో ఆడిన అప్రోచ్ టెస్టు క్రికెట్కు పనిచేయదు. కొద్దిగా ఒత్తిడికి గురికాగానే ప్రమాదకరమైన అటాకింగ్ షాట్కు ప్రయత్నిస్తున్నాడు అని డీకే అన్నాడు. ఇక రోహిత్ తన టెక్నిక్ను నమ్ముకోవాలని.. భారీ షాట్లకు వెళ్లకుండా మరింత బ్యాలెన్స్ అప్రోచ్తో ఆడాలని సూచించాడు. రోహిత్ శర్మ ఓపెనర్గా తన బాధ్యతలను స్వీకరించినప్పుడు గతంలో ఏం చేశాడో ఇప్పుడు అలా చేయడం లేదు. అప్పుడు అతడు తన టెక్నిక్ను విశ్వసించేవాడు అని డీకే తెలిపాడు.

# ఐపీఎల్ మెగా వేలంపై బిగ్ అప్‌డేట్..?




**● ఐపీఎల్ మెగా వేలం ఎప్పుడు.. ఎక్కడ జరుగుతుందనే దానిపై క్రికెట్ అభిమానుల్లో ఉత్కంఠ ● ఇప్పటికే ఫ్రాంచైజీలు ఆటగాళ్ల రిటెన్షన్.. రిలీజ్**

ఐపీఎల్ మెగా వేలం ఎప్పుడు, ఎక్కడ జరుగుతుందనే దానిపై క్రికెట్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే ఫ్రాంఛైజీలు ఆటగాళ్లను రిటెన్షన్, రిలీజ్ చేసిన సంగతి తెలిసిందే.. ఇక ఉన్నదంతా మెగా వేలం ఎప్పుడు జరుతుందనేది. మెగా వేలంలో ఫ్రాంఛైజీలు ఏ ఏ ఆటగాళ్లను తీసుకుంటారు ఏఏ ఆటగాళ్లు ఏ జట్టుకు వెళ్తారనేది క్రికెట్ అభిమానుల్లో సస్పెన్స్ నెలకొంది. అయితే.. ఐపీఎల్ 2025 మెగా వేలంకు సంబంధించి బిగ్ అప్ డేట్ వచ్చింది. ఆక్షన్ నిర్వహించే తేదీ, వేదిక గురించి కొన్ని వార్తలు వస్తున్నాయి. ప్రకారం.. ఐపీఎల్ 2025 మెగా వేలం నవంబర్ చివరిలో రియాద్లో జరగనున్నట్లు తెలుస్తోంది. నవంబర్ 24, 25 తేదీల్లో మెగా వేలం జరుగునున్నట్లు సమాచారం.
కాగా.. ఐపీఎల్ 2025 మెగా వేలంలో పంజాబ్ కింగ్స్ జట్టు దగ్గర ఎక్కువ మనీ ఉంది. ఆ జట్టు వేలానికి ముందు ఇద్దరు అన్క్యాప్డ్ ఆటగాళ్లు ప్రభ్సిమ్రాన్ సింగ్, శశాంక్ సింగ్లను మాత్రమే జట్టులో ఉంచుకుంది. ఈ క్రమంలో పంజాబ్ కింగ్స్ అధిక మొత్తంలో డబ్బును ఖర్చు చేయనుంది. ఇదిలా ఉంటే.. జోస్ బట్లర్, కెఎల్ రాహుల్, శ్రేయాస్ అయ్యర్, గ్లెన్ మాక్స్వెల్, రిషబ్ పంత్ వంటి కీలక ఆటగాళ్లు వేలంలో అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఈ క్రమంలో.. అన్ని ఫ్రాంఛైజీలు వీరి కోసం భారీ మొత్తాన్ని వెచ్చించేందుకు సిద్ధమవుతున్నాయి. ఐపీఎల్ 2025లో 5 జట్లు కొత్త కెప్టెన్ కోసం వెతుకుతున్నాయి. ఇందులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, కోల్కతా నైట్ రైడర్స్, ఢిల్లీ క్యాపిటల్స్, పంజాబ్ కింగ్స్, లక్నో సూపర్ జెయింట్స్ జట్లు ఉన్నాయి. ఐపీఎల్ 2025 మెగా వేలంలో రిటైన్ చేయబడిన 46 మంది ఆటగాళ్లలో 36 మంది భారతీయులు, 10 మంది విదేశీ ఆటగాళ్లు ఉన్నారు. వీరికి రూ.558.5 కోట్ల భారీ మొత్తం వెచ్చించారు. అత్యధిక మొత్తంతో అట్టిపెట్టుకున్న ఆటగాళ్ల జాబితాలో హెన్రిచ్ క్లాసెన్, విరాట్ కోహ్లీ టాప్-2లో ఉన్నారు. క్లాసెన్ను సన్రైజర్స్ హైదరాబాద్ రూ.23 కోట్లకు, విరాట్ కోహ్లీని రూ.21 కోట్లకు ఆర్సీబీ అట్టిపెట్టుకుంది.

# క్రికెట్‌కు గుడ్ బై

**భారత స్టార్ వికెట్ కీపర్ బ్యాట్స్‌మెన్ వృద్ధిమాన్ సాహా**



టీమిండియా న్యూజిలాండ్తో మూడు మ్యాచ్ల టెస్ట్ సిరీస్ను టీమిండియా 0-3తో ఓటమి చవిచూడాల్సి వచ్చింది. సొంతగడ్డపై మూడు మ్యాచ్ల టెస్టు సిరీస్లో టీమిండియా వైట్వాష్ కావడం భారత క్రికెట్ చరిత్రలో ఇదే తొలిసారి. ఈ ఘోరమైన ఓటమి తర్వాత, అకస్మాత్తుగా టీమిండియా వికెట్ కీపర్ బ్యాట్స్మెన్ రిటైర్మెంట్ ప్రకటించాడు. బెంగాల్ తరఫున రంజీ ట్రోఫీ ఆడుతున్న భారత స్టార్ వికెట్ కీపర్ బ్యాట్స్మెన్ వృద్ధిమాన్ సాహా సోషల్ మీడియా ద్వారా రిటైర్మెంట్ ప్రకటించాడు. ఈసారి తన కెరీర్లో చివరి రంజీ సీజన్ ఆడనున్నట్టు సాహా తెలిపాడు. అతను 2021లో టీమ్ ఇండియా తరఫున తన చివరి మ్యాచ్ ఆడాడు. మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ రిటైర్మెంట్ తర్వాత, సాహా కొంతకాలం భారత టెస్టు జట్టుకు శాశ్వత వికెట్ కీపర్గా కనిపించాడు.
అయితే, 2021లో భారత జట్టు మేనేజ్మెంట్ సాహాను జట్టు నుండి తొలగించాలని నిర్ణయించింది. రిషబ్ పంత్కు బ్యాకప్గా భరత్ ఎంపికయ్యాడు. అయితే, ప్రస్తుతం ధృవ్ జురెల్ టెస్ట్ టీమ్ ఇండియాలో పంత్కు బ్యాకప్గా కనిపిస్తున్నాడు. సోషల్ మీడియాలో షేర్ చేసిన ఒక పోస్ట్లో, క్రికెట్లో చిరస్మరణీయమైన ప్రయాణం తర్వాత, ఈ సీజన్ నా చివరిది. రిటైర్మెంట్కు ముందు రంజీ ట్రోఫీలో మాత్రమే ఆడడం నాకు గౌరవంగా ఉంది. ఈ సీజన్ను గుర్తుండిపోయేలా చేయండి. అంటూ రాసుకొచ్చాడు వృఎద్ధిమాన్ సాహా. వృద్ధిమాన్ సాహా తన కెరీర్లో టీమిండియా తరఫున 40 టెస్టులు, 9 వన్డేలు ఆడాడు. టెస్టులో 56 ఇన్నింగ్స్లలో, అతను 29.41 సగటుతో 1353 పరుగులు చేశాడు. ఇందులో 3 సెంచరీలు, 6 అర్ధ సెంచరీలు ఉన్నాయి. అలాగే సాహా 5 వన్డేల్లో 41 పరుగులు చేశాడు.

# దులీప్ ట్రోఫీలో ఆడాలని చెప్పినా.. స్టార్లు పట్టించుకోలేదా?

స్వదేశంలో న్యూజిలాండ్తో జరిగిన మూడు టెస్టుల సిరీస్ను టీమ్ఇండియా కోల్పోయింది. 91 ఏళ్ల భారత క్రికెట్ టెస్టు చరిత్రలో మొదటిసారి 3 అంత కంటే ఎక్కువ టెస్టులు కలిగిన సిరీస్ను వైట్వాష్ కావడం గమనార్హం. దీనికి కారణం దేశవాళీ క్రికెట్లో ఆడకపోవడమేనని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. టీ20 ప్రపంచకప్ తర్వాత దాదాపు నెల రోజుల సమయం విరామం వచ్చింది. కానీ, భారత స్టార్ ఆటగాళ్లు విరాట్ కోహ్లీ, రోహిత్, బుమ్రా, అశ్విన్ తదితరులు దులీప్ ట్రోఫీ బరిలో దిగలేదు. చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ నేతృఎత్వంలోని కమిటీ అంతర్జాతీయ క్రికెటర్లు దేశవాళీలో ఆడాలని సూచించినట్లు వార్తలు వచ్చాయి. సరైన మ్యాచ్ ప్రాక్టీస్ లేకపోవడంతోనే రోహిత్, విరాట్ బ్యాటింగ్లో ఘోరంగా విఫలమవ్వడానికి కారణమని మాజీలు కూడా వ్యాఖ్యానించారు. అసలు వారు ఆడకపోవడానికి గల లాజిక్ ఏంటో తెలియడం లేదని విమర్శలు గుప్పించారు.

**సెలక్టర్ల ప్రణాళిక ఇది.. కానీ**

బెంగళూరు, అనంతపురం వేదికగా సెప్టెంబర్లో దులీప్ ట్రోఫీ జరిగింది. అంతర్జాతీయ క్రికెటర్లూ చాలామంది బరిలోకి దిగారు. కానీ, స్టార్ క్రికెటర్లు మాత్రం ఆడలేదు. వారితో ఆడించేందుకు బీసీసీఐ సెలక్టర్లు ప్రణాళికలు సిద్ధం చేశారు. తొలుత రోహిత్, విరాట్, అశ్విన్ ఆడేందుకు అంగీకరించినట్లు తెలుస్తోంది. కానీ, ట్రోఫీ ప్రారంభం నాటికి తాము విశ్రాంతి తీసుకుంటామని బోర్డుకు చెప్పినట్లు సమాచారం. దీంతో స్టార్లను దులీప్ ట్రోఫీ బరిలోకి దింపడంలో చొరవ చూపలేదని.. అందుకే మిగతా క్రికెటర్ల మాదిరిగా సరైన ప్రాక్టీస్ వారికి లభించలేదనే విమర్శలూ వచ్చాయి. ఈ ట్రోఫీలో గిల్, సర్ఫరాజ్, పంత్, యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సుందర్ తదితరులు ఆడారు. దేశవాళీ క్రికెట్లో ఆడుంటే.. ఇలాంటి పరిస్థితి తప్పి ఉండేదన్న అభిప్రాయమూ వ్యక్తమైంది.

**సరైన సన్నద్ధత లేకపోవడమే: సునీల్ గావస్కర్**

నెల రోజుల వ్యవధి తర్వాత మైదానంలో దిగే వారికి ప్రాక్టీస్ అత్యంత అవసరం. బంగ్లాదేశ్ను ఓడించిన టీమ్ఇండియా న్యూజిలాండ్పైనా ఆధిపత్యం ప్రదర్శిస్తుందని అంతా భావించాం. కానీ, కివీస్ అద్భుతంగా ఆడింది. ఎదురు దాడికి దిగింది. ఐపీఎల్లో వారు ఆడటంతో ఇక్కడి పిచ్లపై అవగాహన ఉంది. మనవాళ్లు మాత్రం స్పిన్ను ఎదుర్కోవడంలో తడబాటుకు గురయ్యారు. సరైన సన్నద్ధత లేకపోవడమే దానికి కారణం అని భారత మాజీ క్రికెటర్ సునీల్ గావస్కర్ వ్యాఖ్యానించాడు. మరోవైపు భారత్ ఓటమికి కెప్టెన్గా తనదే బాధ్యతని ఇప్పటికే రోహిత్ శర్మ వెల్లడించిన సంగతి తెలిసిందే. స్పిన్ను ఆడటంలో ఇబ్బందిపడటం ప్రధాన సమస్యగా భావిస్తున్నట్లు పేర్కొన్నాడు.




## టీమిండియాకు మరో ఎదురుదెబ్బ..
# ఆ ట్రోఫీ నుంచి షమీ ఔట్..!



దాదాపు ఏడాది పాటు టీమిండియాకు దూరమైన మహ్మద్ షమీ ఆటను చూడాలంటే అభిమానులు మరికొంత కాలం వేచి చూడాల్సిందే. రంజీ ట్రోఫీలో ఆడనున్న షమీ.. తదుపరి రెండు రౌండ్ల మ్యాచ్లకు దూరమయ్యాడు. దేశవాళీ రెడ్ బాల్ టోర్నమెంట్లో కర్ణాటక, మధ్యప్రదేశ్లతో జరిగే తదుపరి రెండు మ్యాచ్ల బెంగాల్ జట్టులో మహ్మద్ షమీకి చోటు దక్కలేదు. 34 ఏళ్ల షమీ వన్డే ప్రపంచకప్లో తన చివరి మ్యాచ్ ఆడాడు. అహ్మదాబాద్లో ఆస్ట్రేలియాతో జరిగిన ఫైనల్ మ్యాచ్ తర్వాత మళ్లీ మైదానంలోకి అడుగుపెట్టలేదు. ఈ క్రమంలో ఆస్ట్రేలియాతో జరుగునున్న బోర్డర్ గవాస్కర్ ట్రోఫీకి కూడా ఆడటం కష్టంగానే కనిపిస్తోంది.
అయితే.. ఇటీవలే తాను ఆస్ట్రేలియా టూర్కు వెళ్తానని షమీ చెప్పుకొచ్చాడు. ఈ క్రమంలోనే ముందు రంజీ మ్యాచ్లో ఆడాలని నిర్ణయించుకున్నట్లు తెలిపాడు. అయితే ఇది ఇప్పట్లో సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. మహ్మద్ షమీకి ఫిబ్రవరిలో లండన్లో శస్త్రచికిత్స జరిగింది. అయితే.. బంగ్లాదేశ్, న్యూజిలాండ్లతో స్వదేశంలో జరిగే టెస్ట్ సిరీస్లో ఆడాలనుకున్నప్పటికీ.. మోకాలి వాపు కారణంగా అతను రీ ఎంట్రీ ఇవ్వలేకపోయాడు. అంతకుముందు బెంగాల్ కోచ్ లక్ష్మీ రత్న శుక్లా మాట్లాడుతూ.. ఆస్ట్రేలియా టూర్కు షమీ తనను తాను సిద్ధం చేసుకుంటున్నాడని అన్నారు. అక్కడ పాల్గొనే ముందు.. రంజీ ట్రోఫీ ఆడి పట్టు సాధించాలని కోరుకుంటున్నాడని తెలిపారు. అయితే షమీ పునరాగమనం ఇప్పట్లో సాధ్యమయ్యేలా కనిపించడం లేదని పేర్కొన్నారు.

# ఆస్ట్రేలియాలో వార్మప్ మ్యాచ్‌లు.. జూనియర్లకు అత్యవసరం

బోర్డర్ - గావస్కర్ ట్రోఫీ కోసం భారత్ మరికొన్ని రోజుల్లో ఆస్ట్రేలియాకు వెళ్లనుంది. అయితే, భారత్ తో టీమ్ఇండియా వార్మప్ మ్యాచ్ను తొలుత బీసీసీఐ రద్దు చేసింది. సోషల్ మీడియా వేదికగా బీసీసీఐ నిర్ణయంపై కామెంట్లు వచ్చాయి. అక్కడి పిచ్ పరిస్థితులను అర్థం చేసుకోవడానికి అవకాశం కోల్పోయే ప్రమాదం ఉన్నట్లు అభిమానులు చెబుతున్నారు. ఇదే అభిప్రాయాన్ని క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ కూడా వెల్లడించాడు. దీనిపై బీసీసీఐ పునరాలోచన చేయాలని సూచించాడు. సీనియర్లకు అవసరం లేకపోయినా.. కొత్త కుర్రాళ్లకు అక్కడి పరిస్థితులపై అవగాహన వచ్చేందుకు ఈ వార్మప్ మ్యాచ్లు ఉపయోగపడతాయని తెలిపాడు.
ఆసీస్ పర్యటనలో వార్మప్ మ్యాచ్ ఉండాలని బలంగా కోరుకుంటా. టెస్టుల మధ్య వ్యవధి ఉన్నప్పుడు.. ఇలాంటివి చాలా ఉపయోగపడతాయి. సీనియర్లకు అవసరం లేకపోవచ్చేమో కానీ.. కుర్రాళ్లకు ఉండాల్సిందే. యశస్వి జైస్వాల్, సర్ఫరాజ్ ఖాన్, ధ్రువ్ జురెల్ వంటి యువ బ్యాటర్లకు అవసరం. కనీసం ఆస్ట్రేలియా లేదా అక్కడి రాష్ట్రస్థాయి జట్టుతోనైనా వార్మప్ ఆడే అవకాశాన్ని కల్పిస్తే బాగుంటుంది అని గావస్కర్ వెల్లడించాడు. ఇప్పటికే భారత్ జట్టు ఆస్ట్రేలియాలో ఉంది. సీనియర్ టీమ్ నవంబర్ 10న బయల్దేరే అవకాశం ఉంది. తొలి టెస్టు లేదా రెండు మ్యాచ్లకు కెప్టెన్ రోహిత్ శర్మ అందుబాటులో ఉండకపోవచ్చు. ఇప్పటికే అభిమన్యు ఈశ్వరన్ను మరో ఓపెనర్గా తీసుకున్న సంగతి తెలిసిందే. కివీస్తో ఓటమి చవిచూసిన భారత్ ప్రపంచ టెస్టు ఛాంపియన్షిప్ ఫైనల్కు చేరే అవకాశాలను సంక్లిష్టం చేసుకుంది. ఇప్పుడు ఆసీస్పై 4-0 తేడాతో గెలవాల్సి ఉంది. ఒక్క మ్యాచ్ ఓడినా ఫైనల్ అవకాశాలు తగ్గిపోతాయి.



**ఆసీస్ సిరీస్ మరీ కష్టం: హర్భజన్**

న్యూజిలాండ్తో టెస్టు సిరీస్ ఓడిపోయాక భారత్పై ఒత్తిడి పెరగడం సహజం. మున్ముందు ఆస్ట్రేలియా పర్యటనలో ఇంకా కఠిన సవాళ్లు ఎదురుకానున్నాయి. అయితే, లోపాలు బయటపడటం కూడా మంచిదే. తర్వాత సిరీస్లో మెరుగుపర్చుకొనేందుకు అవకాశం ఉంటుంది. స్పిన్ను ఆడటంలో భారత బ్యాటర్లు ఇబ్బందిపడ్డారు. చివరి మ్యాచ్ కూడా కేవలం మూడు రోజుల్లోనే ముగిసింది. ఇది టెస్టు క్రికెట్కు మంచిది కాదు. టెస్టు ఐదు రోజుల పాటు సాగి ఫలితం వస్తే ఆ మజానే వేరు. భారత బ్యాటర్లు ఇలా ఆడతారని ఎవరూ ఊహించి ఉండరు అని భారత మాజీ క్రికెటర్ హర్భజన్సింగ్ వ్యాఖ్యానించాడు. కివీస్తో సిరీస్లో మాదిరిగా విరాట్, రోహిత్ ఆడితే ఆసీస్పైనా విజయం సాధించడం కష్టమేనని క్రికెట్ వ్యాఖ్యాత హర్షా భోగ్లే తెలిపాడు. ఈమేరకు సోషల్ మీడియా వేదికగా వారిద్దరి గణాంకాలతో చేసి పెట్టిన పోస్టు వైరల్గా మారింది.

**నిర్లక్ష్యమని చెప్పలేం: సంజయ్ మంజ్రేకర్ :** కివీస్తో మూడో టెస్టులో కెప్టెన్ రోహిత్ శర్మ ఇంకాస్త సమయం క్రీజ్లో ఉంటే బాగుండేదన్న అభిప్రాయం అభిమానుల్లో ఉంది. నిర్లక్ష్యంగా ఆడటం వల్లే ఓటమి ఎదురైందనే కామెంట్లూ వచ్చాయి. భారత మాజీ క్రికెటర్ సంజయ్ మాత్రం వాటిని కొట్టిపడేశాడు. నేనెప్పుడూ రోహిత్ నిర్లక్ష్యంగా ఆడతాడని అనను. అతడు దూకుడుగా ఆడి పరుగులు రాబట్టాలని చూస్తాడు. డిఫెన్స్పై అతడికి నమ్మకం తక్కువ. అందుకే, వేగంగా రన్స్ చేసి ప్రత్యర్థిపై ఒత్తిడి తేవాలని అనుకుంటాడు. ఈక్రమంలో కొన్నిసార్లు ఔట్ అవుతూ ఉంటాడు. డిఫెన్సివ్గా ఆడకపోవడమే రోహిత్ ప్రధాన సమస్య అని మంజ్రేకర్ వ్యాఖ్యానించాడు.

## ఆ బ్యాటింగ్ ఆర్డర్‌లో నేనున్నా..
# కంగారు పడేవాడినే



భారత్ స్వదేశంలో మూడు టెస్టుల సిరీస్ను కోల్పోయి ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనుంది. బోర్డర్ - గావస్కర్ ట్రోఫీ సందర్భంగా ఆసీస్తో ఐదు టెస్టులు ఆడనుంది. ప్రపంచ టెస్టు ఛాంపియన్షిప్ ఫైనల్కు చేరుకొనేందుకు ఇరు జట్లకూ ఈ సిరీస్ అత్యంత కీలకం. పాయింట్ల పట్టికలో తొలి రెండు స్థానాల్లో ఆసీస్, భారత్ ఉన్నాయి. గత రెండుసార్లు ఆస్ట్రేలియాను టీమ్ఇండియా ఓడించిన సంగతి తెలిసిందే. హ్యాట్రిక్ కొట్టేందుకు వస్తోన్న భారత్కు అడ్డుకట్ట వేస్తామని ఇప్పటికే ఆసీస్ కెప్టెన్ పాట్ కమిన్స్ వ్యాఖ్యానించాడు. తాజాగా ఆసీస్ మాజీ ఆటగాడు డేవిడ్ వార్నర్ కీలక వ్యాఖ్యలు చేశాడు. పెద్దగా ఫామ్లో లేని భారత బ్యాటర్లను ఆస్ట్రేలియా బౌలింగ్ తీవ్రంగా ఇబ్బందిపెట్టడం ఖాయమని పేర్కొన్నాడు. ఒకవేళ తాను కూడా టీమ్ఇండియా బ్యాటింగ్ ఆర్డర్లో ఉండి ఉంటే తప్పకుండా కంగారుపడేవాడినని వ్యాఖ్యానించాడు. తొలి టెస్టులో భారత్ను 46 పరుగులకే ఆలౌట్ చేసిన కివీస్ను వార్నర్ ప్రశంసించాడు. అద్భుతమైన బౌలింగ్తోపాటు కీలక క్యాచ్లను అందుకొన్నారని కొనియాడాడు. శ్రీలంకతో సిరీస్ ఓడిన న్యూజిలాండ్ నుంచి ఇలాంటి ప్రదర్శన ఊహించలేదు. భారత్తో తొలి టెస్టులో మంచి క్యాచ్లను అందుకొని వారి ఉద్దేశం ఏంటో చెప్పకనే చెప్పింది. క్లిష్టమైన క్యాచ్లను పట్టుకోవడం వల్ల మ్యాచ్లో పైచేయి సాధించేందుకు ఎక్కువ అవకాశం ఉంటుంది. కివీస్ చివరి టెస్టు వరకూ ఇదే దూకుడు కొనసాగించింది. భారత్లో గెలవడం చాలా కష్టమని తెలుసు. ఇప్పుడు అదే ఆస్ట్రేలియా క్రికెటర్లకూ హెల్ప్ అవుతుంది. స్వదేశంలో మూడు టెస్టుల సిరీస్ను ఓడిన భారత జట్టు ఆసీస్కు రానుంది. ప్రపంచంలోనే అత్యుత్తమ పేస్ ఎటాక్ కలిగిన ఆస్ట్రేలియాను ఎదుర్కోవడం భారత్కు కష్టమే. అదే సమయంలో వరల్డ్ క్లాస్ స్పిన్నర్ మాకు ఉన్నాడు. ఒకవేళ నేను కూడా భారత్ బ్యాటింగ్ ఆర్డర్లో ఉండుంటే.. ఆసీస్ బౌలింగ్ దళాన్ని చూసి కంగారుపడేవాడినే. భారత్పై ఆధిపత్యం ప్రదర్శించాలంటే మా టాప్ ఆర్డర్ భారీగా పరుగులు చేయాల్సిందే. షమీ (ఇప్పుడు స్క్వాడ్లో లేడు) వేగంగా కోలుకొని ఆసీస్ వచ్చేందుకు ప్రయత్నిస్తున్నాడు. అతడిని ఎదుర్కోవడం చాలా కష్టం. ఇక బుమ్రా గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. అతడితోపాటు సిరాజ్ ఆసీస్ పిచ్లపై చెలరేగుతాడు. వారిద్దరిని తట్టుకొని ఆసీస్ బ్యాటర్లు నిలదొక్కుకుంటే పరుగుల వరద పారించే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

## మా నాన్న నుంచి అలాంటి
# ప్రశంసలు ఎప్పుడూ రాలేదు



భారత్‌ను టెస్టుల్లో స్వదేశంలోనే మట్టి కరిపించి న్యూజిలాండ్ షాకిచ్చింది. తొలిసారిగా టీమ్ఇండియాపై 3-0 తేడాతో సిరీస్‌ను గెలిచి కివీస్ చరిత్ర సృష్టించింది. ఈనేపథ్యంలో ఆ జట్టు ఆటగాళ్లు సంబరాల్లో మునిగి తేలుతున్నారు. కివీస్ ఆల్రౌండర్, భారత మూలాలున్న రచిన్ రవీంద్ర.. ఈ చారిత్రక విజయంపై స్పందించాడు. ఈసందర్భంగా తన తండ్రి పంపిన ఓ టెక్ట్స్ మెసేజ్ను పంచుకున్నాడు. టీమ్ఇండియాను వైట్వాష్ చేయగానే.. నిన్ను చూస్తే గర్వంగా ఉంది అంటూ మెచ్చుకున్నాడని తెలిపాడు. అయితే.. ఇలాంటి ప్రశంసలు తన తండ్రి నుంచి రావడం చాలా అరుదని పేర్కొన్నాడు. తాను క్రికెటర్గా ఎదగడానికి తన తల్లిదండ్రులు ఎంత కష్టపడ్డారో ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నాడు. నీ పట్ల చాలా గర్వంగా ఉంది అని మా నాన్న ప్రశంసించడాన్ని నేను ఎప్పుడూ చూడలేదు. మేం భారత్పై గెలవగానే ఇలాంటి మెసేజ్ రావడం ఎంతో ఆనందంగా అనిపించింది. నా కెరీర్ ఎదుగుదలకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. నా కోసం ఉదయాన్నే మా నాన్న లేచి స్కూల్కు వెళ్లే ముందు రెండు గంటల పాటు నాకు బంతులు వేసేవాడు. ఇక మా అమ్మ స్కూల్కు రెడీ చేయడంతోపాటు ట్రైనింగ్కు వెళ్లేందుకు నన్ను సిద్ధం చేసేది. చివరి టెస్టులో విజయం సాధించిన వెంటనే ముంబయిలోని వాంఖడే స్టేడియంలో తమ సంబరాలు ఎంతో ప్రత్యేకమైనవని రచిన్ పేర్కొన్నాడు. గతంలో ఎప్పుడూ తాను ఇలాంటి అనుభూతి చెందలేదని వివరించాడు. ఈ సిరీస్ విజయంలో రచిన్ కీలకపాత్ర పోషించిన విషయం తెలిసిందే. మూడు టెస్టుల్లో కలిపి ఆ జట్టు తరఫున అత్యధిక పరుగులు (256) చేశాడు. ఇందులో అతడి అత్యుత్తమ స్కోరు 134. ఇక 2021లో రచిన్ పోరాటంతోనే కాన్పూర్లో భారత్తో జరిగిన టెస్టు డ్రాగా ముగిసిన సంగతి తెలిసిందే.

# అదే జరిగితే.. గంభీర్ పవర్స్‌కు బీసీసీఐ కత్తెర వేసినట్లే!

టీ20 ప్రపంచకప్ తర్వాత భారత్ జట్టు ప్రధాన కోచ్గా గౌతమ్ గంభీర్ బాధ్యతలు స్వీకరించాడు. శ్రీలంకతో టీ20 సిరీస్ను టీమ్ఇండియా గెలిచింది. వన్డే సిరీస్ను మాత్రం కోల్పోయింది. ఆ తర్వాత బంగ్లాపై టెస్టు సిరీస్ను గెలుచుకుంది. కానీ, న్యూజిలాండ్తో మూడు టెస్టుల సిరీస్ను 0-3 తేడాతో కోల్పోయిన భారత్ తొలిసారి వైట్వాష్కు గురైంది. గౌతమ్ గంభీర్పై భారీ అంచనాలు ఉండేవి. వన్డే ప్రపంచ కప్, ఛాంపియన్స్ ట్రోఫీ, ప్రపంచ టెస్టు ఛాంపియన్షిప్ గదను సొంతం చేసుకోవాలనే లక్ష్యంతో భారత్ ఉంది. ఇప్పుడు డబ్ల్యూటీసీ ఫైనల్కు వెళ్లడమే కష్టంగా మారడం అభిమానులను ఆవేదనకు గురిచేస్తోంది. మాజీ కోచ్లు రవిశాస్త్రి, రాహుల్ ద్రవిడ్కు కూడా ఇవ్వని వెసులుబాటు ఇప్పటివరకు గంభీర్కు బీసీసీఐ మేనేజ్మెంట్ ఇచ్చింది. ఒకవేళ ఆసీస్ పర్యటనలోనూ ఓటమి ఎదురైతే అతడి పవర్స్కు కత్తెర వేసే ఆలోచనలో బీసీసీఐ ఉన్నట్లు తెలుస్తోంది.
సాధారణంగా జట్టు సెలక్షన్ సమావేశాల్లో ప్రధాన కోచ్ పాల్గొనరు. కానీ, గంభీర్కు మాత్రం అవకాశం కల్పించడం జరిగింది. ద్రవిడ్, రవిశాస్త్రికి కూడా ఈ వెసులుబాటు ఇవ్వలేదు. కానీ, గంభీర్కు మాత్రం బీసీసీఐ మినహాయింపు ఇచ్చింది. ఆస్ట్రేలియా పర్యటన కోసం ఎంపిక చేసిన జట్టు విషయంలోనూ గంభీర్కు పూర్తి స్వేచ్ఛ ఇచ్చిందని.. ఒకవేళ ఆ టోర్నీలో విఫలమైతే మాత్రం అతడికి ఇబ్బందులు తప్పవని క్రికెట్ వర్గాలు వెల్లడించాయి. కివీస్తో టెస్టు సిరీస్లో సిరాజ్ను నైట్వాచ్మెన్గా పంపడం, సర్ఫరాజ్ఖాన్ను 8వ నంబర్లో ఆడించాలని అనుకోవడం ప్రతికూల ఫలితాలను అందించాయి. దీంతో గంభీర్ వ్యూహాత్మక నిర్ణయాలపై ప్రశ్నలు తలెత్తాయి.
గంభీర్కు చాలా మినహాయింపులు దక్కాయి. బీసీసీఐ నిబంధనల ప్రకారం జట్టు ఎంపికలో కోచ్కు ఎలాంటి పాత్ర ఉండదు. కానీ, ఆస్ట్రేలియా పర్యటన కోసం జరిగిన సమావేశంలో గంభీర్ కోసం ఆ రూల్ నుంచి వెసులుబాటు కల్పించింది. ప్రధాన కోచ్ తనకు అవసరమైన ఆటగాళ్లపై సూచనలు, సలహాలు ఇవ్వడానికి అనుమతిచ్చింది. అందులో హర్షిత్ రాణా, నితీశ్ రెడ్డిని తీసుకోవాలని బలంగా కోరినట్లు తెలుస్తోంది. బీసీసీఐ సెలక్షన్ కమిటీ కూడా దీనికి అంగీకరించింది. అయితే, ఈ సిరీస్ను గెలిచి డబ్ల్యూటీసీ ఫైనల్కు చేరకపోతే మాత్రం గంభీర్ తన అధికారాల్లో కోతను ఎదుర్కోవాల్సి ఉంటుంది అని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. పేస్ ఆల్రౌండర్ హార్దిక్ పాండ్యను భర్తీ చేస్తాడనే ఉద్దేశంతో తెలుగు కుర్రాడు నితీశ్ రెడ్డికి అవకాశం దక్కింది.



సూర్య cinema@suryaa.com
విజయవాడ
మంగళవారం
5 నవంబర్ 2024



# సూర్య సినిమా

## మమ్ముట్టి కొడుకుని అయినప్పటికీ సాధారణ యువకుల్లా ఆలోచిస్తా



మలయాళ స్టార్ దుల్కర్ సల్మాన్ తెలుగు హీరో అయిపోయారు. 'మహానటి', 'సీతారామం' వంటి విజయవంతమైన చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన దుల్కర్, 'లక్కీ భాస్కర్'తో హ్యాట్రిక్ విజయాన్ని సాధించి, తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానాన్ని సంపాదించుకున్నారు. దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో మీనాక్షి చౌదరి కథానాయిక. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీత దర్శకుడు. దీపావళి కానుకగా థియేటర్లలో విడుదలైన 'లక్కీ భాస్కర్', అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తూ సంచలన వసూళ్లతో దూసుకుపోతోంది. ఈ నేపథ్యంలో తాజాగా మీడియాతో ముచ్చటించిన కథానాయకుడు దుల్కర్ సల్మాన్ పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.

వెంకీ కథ చెబుతున్నప్పుడు, ఫస్ట్ హాఫ్ వినగానే ఈ సినిమా ఖచ్చితంగా చేయాలి అనుకున్నాను. బ్యాంకింగ్ నేపథ్యాన్ని తీసుకొని మధ్యతరగతి కుటుంబ కథ చెప్పడం కొత్తగా అనిపించింది. నేను ఎప్పటినుంచో వాస్తవానికి దగ్గరగా ఉండే ఒక మధ్యతరగతి తండ్రి పాత్ర చేయాలి అనుకుంటున్నాను. అది ఈ సినిమాతో నెరవేరింది. నా దృష్టిలో ఇది వాస్తవ కథ. బ్యాక్ గ్రౌండ్ లో హర్షద్ మెహతా లాంటివాడు భారీ స్కాం చేస్తుంటే, ఒక చిన్న బ్యాంక్ ఉద్యోగి తన పరిధిలో స్కాం చేయడం అనేది కొత్త పాయింట్. ఇది బ్యాంకింగ్ నేపథ్యమున్న సినిమా కావడంతో వెంకీ ఎంతో రీసెర్చ్ చేశాడు. బ్యాంకింగ్ సెక్టార్ కి చెందినవారు కూడా ఇందులో ఎటువంటి తప్పులు లేవని చెప్పడం విశేషం. నటుడిగా అన్నిరకాల పాత్రలు చేయాలి. షారుఖ్ ఖాన్ లాంటివారు కూడా నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలు చేశారు. మనలోని నటుడిని బయటకు తీసుకురావాలంటే ఇలాంటి విభిన్న పాత్రలు చేయాలి. భాస్కర్ పాత్రలో ఎన్నో ఎమోషన్స్ ఉన్నాయి. నటుడిగా ఇలాంటి పాత్రలు సంతృప్తిని ఇస్తాయి. ప్రతి రోజూ, ప్రతి సన్నివేశం చేయడాన్ని ఆస్వాదించాను. ప్రతి దశలో ఎంజాయ్ చేశాను. ఈ సినిమా ఎంతో సంతృప్తిని ఇచ్చింది. మమ్ముట్టి కొడుకుని అయినప్పటికీ, నేనూ సాధారణ యువకుల్లాగానే ఆలోచిస్తాను. యువకుడిగా ఉన్నప్పుడు లాటరీ తగిలితే, సొంతంగా నాకు నచ్చినవన్నీ కొనుక్కోవచ్చు అని కలలు కనేవాడిని.

## అమ్మవారిని చెరపడే రాక్షసుడి కథే 'జాతర'



సతీష్ బాబు రాటకొండ హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహించిన సినిమా 'జాతర'. దీయా రాజ్ హీరోయిన్ గా నటిస్తోంది. ఈ చిత్రాన్ని గల్లా మంజునాథ్ సమర్పణలో మూవీటెక్ ఎల్ఎల్‌సితో కలిసి రాధాకృష్ణ ప్రొడక్షన్ కంపెనీ పతాకంపై రాధాకృష్ణారెడ్డి, శివశంకర్ రెడ్డి నిర్మిస్తున్నారు. రగ్డ్‌గా, ఇంటెన్స్ డ్రామాతో 'జాతర' తెరకెక్కింది. చిత్తూరు జిల్లా బ్యాక్ డ్రాప్‌లో జరిగే జాతర నేపథ్యంలో రూపొందిన ఈ సినిమా ఈ నెల 8న థియేటర్లోకి రాబోతోంది. ఈ నేపథ్యంలో మూవీ హైలైట్స్‌ను తన ఇంటర్వ్యూలో తెలిపారు హీరో, దర్శకుడు సతీష్ బాబు రాటకొండ. దేవుడు మనుషులను బొమ్మలుగా చేసి జగన్నాటకం ఆడిస్తాడని మన పురాణాల్లో చెబుతుంటారు. ఇందుకు భిన్నంగా ఒక మనిషి దేవుడిని పితలాటకం ఆడిస్తుంటాడు. ఆ పితలాటకం నుంచి అమ్మవారిని హీరో ఎలా రక్షిస్తాడు అనేది ఈ చిత్ర మూల కథాంశం. మనిషి రాక్షసుడై అమ్మవారిని చెరపడితే మరో నరుడు హరుడై ఆ రాక్షసుడిని ఎలా సంహరించాడు అనేది మా 'జాతర' చిత్రంలో చూపిస్తున్నాం. వాస్తవ ఘటనల ఆధారంగా ఫిక్షన్ యాడ్ చేసి ఈ చిత్రాన్ని రూపొందించాను. ఈ చిత్రాన్ని డాక్యుమెంటరీగా తీస్తే వివాదాలు వస్తాయి. సినిమా అయితే క్రియేటివ్ ఫ్రీడమ్ తీసుకుని ప్రేక్షకులకు నచ్చేలా సినిమాను రూపొందించవచ్చు అనిపించింది. హీరో క్యారెక్టర్ మూడు డైమెన్షన్స్ లో ఉంటుంది. అతను ఒక ఫేజ్ నుంచి మరో ఫేజ్ కు వెళ్లేందుకు ప్రేమ అనేది ఒక మీడియంలా ఉంటుంది. అలా ఈ కథలో ఓ మంచి ప్రేమ కథ కూడా ఉంటుంది. మంచి సౌండ్ డిజైనింగ్ ఈ మూవీ కోసం చేశాం. మనం జంధ్యాల సినిమాల్లో విన్నట్లు విలేజ్ లో వినిపించే సహజమైన సౌండ్స్ తరహాలో 'జాతర' చిత్రంలో సౌండ్ డిజైనింగ్ చేయించాం.

చిత్తూరు జిల్లా మదనపల్లె పరిసర గ్రామాల్లో ఈ అమ్మవారి గుడి ఉంటుంది. చుట్టుపక్కల 18 ఊళ్ల ప్రజలు ఈ గుడికి వచ్చి అమ్మవారిని కొలుస్తారు. ఏడాదిన్నర పాటు ఆ ప్రాంతంలో ప్రజలతో ఇంటరాక్ట్ అయి, రీసెర్చ్ చేసి స్క్రిప్ట్ చేసుకున్నాం. గంగమ్మతల్లిని తెలుగు ప్రజలు ఎంతో భక్తి శ్రద్ధలతో పూజిస్తారు. ఆ అమ్మవారి గురించి తీసిన చిత్రమే 'జాతర'.

## 'బేబీ జాన్' టేస్టర్ కట్ కి థంపింగ్ రెస్పాన్స్



వరుణ్ ధావన్, కీర్తి సురేష్, వామికా గబ్బి, జాకీ ష్రాఫ్ లీడ్ రోల్స్‌లో చేస్తున్న సెన్సేషనల్ మూవీ 'బేబీ జాన్'. బ్లాక్‌బస్టర్ డైరెక్టర్ అట్లీ, జియో స్టూడియోస్ A Apple, Cine1 స్టూడియోస్‌తో కలిసి నిర్మిస్తున్న ఈ మూవీ టేస్టర్ కట్ రిలీజ్ అయ్యింది. కలీస్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ దాదాపు రెండు నిమిషాల టీజర్, చీమల గుంపు ఏనుగును ఎలా ఓడించగలవో ఓ యంగ్ గర్ల్ చెప్పే మెస్మరైజ్ కథనంతో ప్రారంభమైయింది. ఈ మెటాఫర్ వరుణ్ క్యారెక్టర్ బేబీ జాన్‌ను అద్భుతంగా ప్రజెంట్ చేసింది. టీజర్ వరుణ్ ను ఫెరోషియస్ పోలీసుగా, ప్రేమగల తండ్రిగా, యాక్షన్ హీరోగా, నైపుణ్యం కలిగిన వంటవాడిగా ఇలా మల్టీషేడ్స్‌లో ప్రజెంట్ చేసింది. బ్రెత్ టేకింగ్ విజువల్స్, అద్భుతమైన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, వరుణ్ అద్భుతమైన స్లో-మోషన్ స్టంట్స్ ప్రేక్షకులను మరింత ఆసక్తిని కలిగించాయి. ఈ టేస్టర్ కట్‌తో సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకాయి. వరుణ్‌తో పాటు ఇందులో కీర్తి సురేష్, వామికా గబ్బి కీలక పాత్రలలో నటించారు, లెజెండరీ జాకీ ష్రాఫ్ విలన్ పాత్రను పోషించారు.

## ఫాన్సీ రేటుకు "విడుదల 2"

తమిళంలో లాస్ట్ ఇయర్ సంచలన విజయం సాధించి తెలుగు ప్రేక్షకులను సైతం విపరీతంగా ఆకట్టుకున్న చిత్రం విడుదల. విజయ్ సేతుపతి పెర్ఫార్మన్స్ హైలెట్ గా రూపొందిన ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. అదేవిధంగా అతి త్వరలో "విడుదల2" చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందించేందుకు ఎంతో మంది నిర్మాతలు పోటీ పడగా, ఫాన్సీ రేట్‌తో ఈ చిత్రాన్ని దక్కించుకున్నారు ప్రముఖ నిర్మాత చింతపల్లి రామారావు. ఈ సందర్భంగా నిర్మాత చింతపల్లి రామారావు మాట్లాడుతూ" విడుదల2 చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందించబోతున్నందుకు సంతోషంగా ఉంది. విజయ్ సేతుపతి, సూరి నటన హైలైట్‌గా ప్రేక్షకులను కనువిందు చేయబోతోంది. అలాగే ఏడు సార్లు నేషనల్ అవార్డు పొందిన ఏకైక దర్శకుడు వెట్రీ మారన్, ఎన్నో సూపర్ హిట్ చిత్రాలను తెరకెక్కించిన ఆర్ ఎస్ ఇన్ఫోటైన్మెంట్ అధినేత ఎల్రెడ్ కుమార్‌తో కలిసి ఈ చిత్రాన్ని అత్యద్భుతంగా తెరకెక్కించారు.



## కాగడ చేతపట్టి "తమ్ముడు" వచ్చేస్తున్నాడు



ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నిర్మాణంలో నితిన్ హీరోగా శ్రీరామ్ వేణు దర్శకత్వంలో రూపొందుతున్న ప్రెస్టీజియస్ మూవీ "తమ్ముడు". ఈ సినిమా ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోంది. "తమ్ముడు" సినిమా రిలీజ్ అనౌన్స్ మెంట్ చేశారు మేకర్స్. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకొస్తున్నట్లు ప్రకటించారు. "తమ్ముడు" సినిమా రిలీజ్ డేట్ అనౌన్స్ మెంట్ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ ఆకట్టుకుంటోంది. కాగడా చేత పట్టిన నితిన్, భుజానికి పాపను ఎత్తుకుని పరుగెడుతూ రావడం, ఆయనతో పాటు ఊరి ప్రజలు కూడా కాగడాలతో వెంటే వస్తుండటం ఆసక్తిని కలిగిస్తోంది. ఈ రిలీజ్ డేట్ పోస్టర్ "తమ్ముడు" సినిమా మీద మరిన్ని అంచనాలు పెంచుతోంది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ లో నిర్మితమవుతున్న 56వ చిత్రమిది. ఈ చిత్రంలో లయ కీలక పాత్రను పోషిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ సంస్థతో హీరో నితిన్, దర్శకుడు శ్రీరామ్ వేణుకు మంచి అనుబంధం ఉంది.

## 7న 'ఘాటి', ఫస్ట్ లుక్ స్పెషల్ గ్లింప్స్



క్వీన్ అనుష్క శెట్టి సెన్సేషనల్ హిట్ 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' తర్వాత క్రియేటివ్ డైరెక్టర్ క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో క్రేజీ హై బడ్జెట్ ప్రాజెక్ట్ చేస్తున్నారు. విమర్శకుల ప్రశంసలు పొంది, కమర్షియల్ బ్లాక్‌బస్టర్ హిట్ అందుకున్న 'వేదం' తర్వాత అనుష్క, క్రిష్ కాంబినేషన్‌లో ఇది రెండవ ప్రాజెక్ట్. ఈ హై బడ్జెట్ వెంచర్‌కి 'ఘాటి' అనే టైటిల్‌ని లాక్ చేశారు. ఈ సినిమా షూటింగ్ కేవలం మూడు రోజుల్లో కోఇన్సిడెంట్‌గా అనుష్క పుట్టినరోజుతో పూర్తవుతుంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని, మేకర్స్ రెండు ముఖ్యమైన అప్‌డేట్‌లను అందిస్తు న్నారు- మూవీ ఫస్ట్ లుక్, ఎ స్పెషల్ గ్లింప్స్ ఇన్‌టు ది వరల్డ్‌ని రిలీజ్ చేస్తున్నారు. టైటిల్ పోస్టర్‌లో ట్రెక్కర్లు ఘాట్‌లను నావిగేట్ చేసే బ్రెత్ టేకింగ్ సీన్ ఆడియన్స్‌ని కట్టిపడేసింది.

## 'జీబ్రా' ఫస్ట్ సింగిల్



టాలెంటెడ్ హీరో సత్యదేవ్, కన్నడ స్టార్ డాలీ ధనంజయ హైలీ యాంటిసిపేటెడ్ మల్టీ స్టారర్ జీబ్రా. ఈశ్వర్ కార్తీక్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని పద్మజ ఫిలింస్ ప్రైవేట్ లిమిటెడ్, ఓల్డ్ టౌన్ పిక్చర్స్ బ్యానర్‌పై ఎస్ఎన్ రెడ్డి, ఎస్ పద్మజ, బాల సుందరం, దినేష్ సుందరం నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఫస్ట్ లుక్ పోస్టర్స్, మోషన్ వీడియో, టీజర్‌తో మేకర్స్ క్యూరియాసిటీని పెంచుతూ సినిమా ప్రమోషన్స్ జరుగుతున్నాయి. టీజర్ మంచి రెస్పాన్స్ తో భారీ అంచనాలను నెలకొల్పింది. మేకర్స్ ఫస్ట్ సింగిల్ మేరీ తేరీ సాంగ్ ని రిలీజ్ చేశారు. సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ రవి బస్రూర్ ఈ సాంగ్ ని మెస్మరైజింగ్ మెలోడీ గా కంపోజ్ చేశారు. పూర్ణాచారి రాసిన లిరిక్స్ ఆకట్టుకున్నాయి. విజయ లక్ష్మి, సంతోష్ వెంకీ తమ ప్లజెంట్ వోకల్స్‌తో లైవ్లీగా పాడారు. ఈ సాంగ్‌లో సత్య దేవ్, ప్రియా భవానీ శంకర్ కెమిస్ట్రీ బ్యూటీఫుల్‌గా వుంది. విజువల్స్ కూల్ అండ్ సూపర్బ్‌గా వున్నాయి. ఈ సాంగ్ ఇన్స్టంట్ హిట్‌గా నిలిచింది. లక్ ఫేవర్స్ ది బ్రేవ్ అనే ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ సినిమాలో సత్యరాజ్, సత్య అక్కల, జెన్నిఫర్ పిషినాటో, సునీల్, కీలక పాత్రలు పోషించారు.

## సాయిధరమ్‌తేజ్‌తో జగపతిబాబు

మెగా సుప్రీమ్ హీరో సాయి దుర్గ తేజ్, రోహిత్ కెపి, కె నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి, ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ SDT18లో వెర్సటైల్ యాక్టర్ జగపతిబాబు మెగా సుప్రీమ్ హీరో సాయి దుర్గ తేజ్ 'విరూపాక్ష', 'బ్రో' బ్లాక్‌బస్టర్ విజయాల తర్వాత, తన అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ SDT18 చేస్తున్నారు. డెబ్యూటెంట్ రోహిత్ కెపి ఈ మూవీకి దర్శకత్వం వహిస్తున్నారు. హనుమాన్ సెన్సేషనల్ పాన్ ఇండియా విజయం తర్వాత నిర్మాతలు కె నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ పై ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌ను హై బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. మేకర్స్ లేటెస్ట్‌గా ఓ క్రేజీ అప్డేట్ ఇచ్చారు. ఈ మూవీలో వెర్సటైల్ యాక్టర్ జగపతి బాబు కీలక పాత్ర పోషిస్తు న్నారు. రగ్గడ్ లుక్‌లో ప్రెజంట్ చేసిన జగపతిబాబు ఇంట్రో పోస్టర్ చాలా క్యూరియాసిటీ పెంచింది.





## కేక్ వాక్ లాంటి మూవీ "ధూం ధాం"

చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా "ధూం ధాం". సాయి కుమార్, వెన్నెల కిషోర్, పృథ్వీరాజ్, గోపరాజు రమణ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఫ్రైడే ఫ్రేమ్ వర్క్స్ బ్యానర్ పై ఎంఎస్ రామ్ కుమార్ నిర్మిస్తున్నారు. "ధూం ధాం" సినిమాను లవ్, ఫ్యామిలీ ఎంటర్ టైనర్ గా దర్శకుడు సాయి కిషోర్ మచ్చా రూపొందిస్తున్నారు. ఈ నెల 8వ తేదీన థియేట్రి కల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ నేపథ్యంలో "ధూం ధాం" సినిమా హైలైట్స్ గురించి హీరోయిన్ హెబ్బా పటేల్ మాట్లాడారు...

- డైరెక్టర్ సాయి రాజేశ్ ఒకరోజు ఫోన్ చేసి "ధూం ధాం" ప్రాజెక్ట్ గురించి చెప్పారు. రైటర్ గోపీ మోహన్ దగ్గర కథ ఉంది. మీకు నచ్చితే చేయండి అన్నారు. నేను కథ విన్నాను. స్క్రిప్ట్ బాగా నచ్చింది. మంచి ఫ్యామిలీ ఎంటర్ టైనర్ మూవీ ఇది. ఈ మధ్య కాలంలో నేను అన్నీ సీరియస్ రోల్స్ చేస్తూ వస్తున్నాను. ఇలాంటి సినిమా నేను చేసి చాలా కాలమవుతోంది. నాకు రిఫ్రెషింగ్ గా ఉంటుందని అనిపించింది. అందుకే వెంటనే ఓకే చెప్పాను.

"ధూం ధాం" లో నా క్యారెక్టర్ పేరు సుహానా. తనొక బబ్లీ గర్ల్. బాగా డబ్బున్న అమ్మాయి. ఇంట్లో ఇచ్చిన ఫ్రీడమ్ వల్ల తను కోరుకున్న వెకేషన్ కు వెళ్తుంటుంది. అలా ఒక వెకేషన్ లో హీరోను కలుస్తుంది. అక్కడి నుంచి వారి స్నేహం, ప్రేమ మొదలవుతాయి. ఈ చిత్రంలో నటించడం నాకు కష్టంగా అనిపించలేదు. కేక్ వాక్ లాంటి ఫీలింగ్ కలిగింది. చేతన్‌తో కలిసి నటించడం హ్యాపీగా ఉంది. తను మంచి కోస్టార్. మా ఇద్దరిలో ఎవరు జూనియర్, ఎవరు సీనియర్ అనేది చూసుకోలేదు. కెమెరా ముందు ఎవరు ఎంత యాక్టివ్‌గా, ఎనర్జిటిక్‌గా పర్ ఫార్మ్ చేస్తాం అనేది ఆలోచించాం. పోలెండ్‌లో లాంగ్ షెడ్యూల్ చేశాం. అక్కడ వింటర్ ఇంకా స్టార్ట్ కాకముందే వెళ్లాం. సాంగ్ షూట్స్‌లో సారీస్ లో కనిపిస్తాను. చలి పెద్దగా లేకపోవడం వల్ల ఇబ్బందిగా అనిపించలేదు.

## టెర్రిఫైయింగ్ ఫస్ట్ లుక్ "భైరవం"



హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ పవర్ ఫుల్ "భైరవం" టైటిల్ తో రూపొందుతున్న మూవీ ఫస్ట్ లుక్ లో టెర్రిఫిక్‌గా కనిపించారు. ఈ ఫస్ట్ లుక్ ఆయన్ని రగ్గడ్ అండ్ రస్టిక్‌గా ప్రజెంట్ చేసింది. బ్యాక్‌గ్రౌండ్‌లో ఉన్న దేవాలయం, ప్రజలు కాగడాలు పట్టుకొని వుండటం పోస్టర్‌కు మరింత ఇంటెన్స్ ని యాడ్ చేస్తోంది. విజయ్ కనకమేడల దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ పవర్ ఫుల్ క్యారెక్టర్ లో కనిపిస్తారని ఫస్ట్ లుక్ పోస్టర్ సూచించింది. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ పతాకంపై కెకె రాధామోహన్ అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పెన్ స్టూడియోస్ డాక్టర్ జయంతి లాల్ గడ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. నియో-నోయిర్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న శ్రీ సత్యసాయి ఆర్ట్స్ ప్రొడక్షన్ నంబర్ 16కి పవర్ ఫుల్ 'భైరవం' అనే టైటిల్ పెట్టారు. టైటిల్ డిజైన్ విశేషంగా ఆకట్టుకుంది. భైరవంలో ప్రముఖ తారాగణం, సాంకేతిక సిబ్బంది ఉన్నారు. మనోజ్ మంచు, నారా రోహిత్ ల ఫస్ట్ లుక్ పోస్టర్లు ఒకదాని తర్వాత ఒకటి త్వరలో విడుదల కానున్నాయి.

## "మిస్టర్ ఇడియట్" 'కావాలయ్యా..' లిరికల్

మాస్ మహరాజ్ రవితేజ తమ్ముడు రఘు కొడుకు మాధవ్ హీరోగా నటిస్తోన్న సినిమా "మిస్టర్ ఇడియట్". ఈ చిత్రంలో సిమ్రాన్ శర్మ హీరోయిన్‌గా నటిస్తోంది. జేజేఆర్ ఎంటర్ టైన్ మెంట్స్ ఎల్ఎల్ పీ పతాకంపై శ్రీమతి యలమంచి రాణి సమర్పణలో నిర్మాత జె జే ఆర్ రవిచంద్ "మిస్టర్ ఇడియట్" సినిమాను నిర్మిస్తున్నారు. పెళ్లి సందడి చిత్రంతో కమర్షియల్ హిట్ అందుకున్న దర్శకురాలు గౌరీ రోణంకి డైరెక్ట్ చేస్తున్నారు. త్వరలోనే ఈ సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. బ్లాక్ బస్టర్ మ్యూజిక్ డైరెక్టర్ తమన్ సోషల్ మీడియా ద్వారా "మిస్టర్ ఇడియట్" సినిమా నుంచి 'కావాలయ్యా..' లిరికల్ సాంగ్ రిలీజ్ చేశారు. 'కావాలయ్యా..' సాంగ్ కంపోజిషన్, పిక్చరైజేషన్ చాలా బాగుందన్న తమన్..హీరో మాధవ్ తో పాటు ఎంటైర్ మూవీ టీమ్ కు బెస్ట్ విశెస్ అందించారు.



PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044.